ఓం

తత్ సత్

శ్రీ

# ఉపదేశరత్నములు

ధర్మముగా నడువుము

శాంతము వహింపుము

హింసను విడువుము


సత్యమునే వచింపుము


దొరకుచోటు :

శ్రీవ్యాసాశ్రమం, యేర్పేడుపోస్టు, (చిత్తూరుజిల్లా)

సర్వధారి, ఆశ్వయుజము 1948 వెల : 0-6-0

ఆంధ్ర గ్రంథాలయ ప్రెస్, విజయవాడ.-2000



# విజ్ఞప్తి

**పరమాత్మస్వరూపులగు మానవోత్తములారా!**

పరమపవిత్రమై వెలయు కృష్ణానదీతీరమందు లోకప్రసిద్ధిగాంచి వెలయుచున్న విజయవాడనగరమున శ్రీ వ్యాసాశ్రమస్థాపకులైన శ్రీశ్రీశ్రీ మలయాళ సద్గురుమూర్తులు సర్వజీవులయొక్క తరణోపాయమునకై చాతుర్మాస్యమహావ్రతమును జరుపవలెనని తలంచెను. తక్షణముననే మహావైభవములైన పూజాసభాభవనములును, పెద్దపెద్ద కొట్టములును, చిన్నచిన్న కుటీరములును, భోజనశాలలును, విద్యుద్దీపంబులును నీళ్లపంపులును, పాకీ పనివారలతో సహా సమస్త వసతులును అమర్చబడెను. వేలకొలది సాధువులును, అనేకులు గృహస్థులైన భక్తబృందములును క్రిక్కిరిసిపోయిరి. అచ్చట నివాసముగాయుండువారికిగాని, వచ్చుచు పోవుచున్న వారికిగాని ఒక్కొక్క దినమున కొక్కొక్కరువంతున పుణ్యాత్ములైన గృహస్థులు భక్ష్యపదార్థములతో ఎంతఖర్చయినను భరించి, భిక్షలుచేయ నారంభించిరి. అట్టి మహావ్రతమునందు ప్రతిరోజున శ్రీవారు సభికులు పరమానందముజెందునట్లు అనంత బోధామృతవర్షమును గురిపించుచుండిరి. అప్పుడప్పుడు ఇతరుల ఉపన్యాసములును, భజనలు, పూజలు, హరికథలు, సంగీతగానములును మహానందముగా జరుగుచుండెను సాధుబృందములందరికిని శ్రీమంతులైనవారు పలువిధములైన దానములును చేయుచుండిరి. ఇదియంతయు చూడ జూడ ఋషిపుంగవులకు అణిమాదిసిద్ధులును, కామధేనువు, కల్పవృక్ష, చింతామణ్యాది మహిమలును యుండుట యదార్థమేనని ప్రత్యక్షముగా దోచుచుండెను. పూర్వకాలమున గోమతీతీరమున శౌనకాదిమహర్షులు జరిపించిన చాతుర్మాస్యములు జ్ఞప్తికివచ్చెను. అప్పుడాయాగమును చూడకపోయినను ఇప్పుడీ వ్రతమును చూచు సంప్రాప్తము గల్గినందుకు సమస్త భక్తబృందములును ధన్యాత్ములయినట్లు తలంచిరి. అట్టి చాతుర్మాస్యమహాసభలో శ్రీవారు చెప్పిన అనంత ప్రబోధములో సాధకులుగా యుండు సర్వసోదరసోదరీమణులందరికిని ముఖ్యముగాఉపయోగించునట్టి చిన్నచిన్న వాక్యము లనుదినమునకొక్కటిరెండు వంతున రత్నములవలె స్వీకరించి అట్టి వాక్యములన్నింటిని చిన్న పొత్తముగా అచ్చువేయించినచో సర్వమానవులకు గొప్పగా ఉపయోగపడగలదని అచ్చువేయించడమైనది.

ఇట్లు,

**సాధు సూరారెడ్డి, సంపాదకులు.**

గూడవల్లి కాపురస్థులగు గూడవల్లి రత్నమ్మగారును,
ఉప్పలపాడు కాపురస్థులగు, పెద్ది పుల్లమ్మ గారును
శ్రీ చాతుర్మాస్య మహావ్రత సమయమున, ఈ
ఉపదేశరత్నములు అచ్చువేయించి, శ్రీసద్గురు
మలయాళస్వాములవారికి సమర్పించిరి. ఈ
పుణ్యాభక్తులను దయామయుడగు సర్వేశ్వ
రుడును, పరమకారుణికులగు మహ
ర్షులును, ఆశీర్వదించి, భక్తి జ్ఞాన
వైరాగ్యములును మోక్షమును
కలుగజేయుదురుగాక.

లోకాస్సమస్తాస్సుఖినోభవన్తు.

ఓం తత్ సత్

ఓం

తత్ సత్

శ్రీ సద్గురుమూర్తయే నమః

# ఉపదేశరత్నములు

1. మహత్తరమైన పుణ్యముచేతనే మానవజన్మము దొరకుచున్నది. అయినను, ఇదియు నొక బుద్బుదము వంటి దనియే యని యెఱుంగవలయును. ఇట్టి మహత్తరమైన జన్మమును కాలము వ్యర్థముగా పోనీయక, పరమాత్మధ్యానమునందు గడపుటయే ఉత్తములయొక్క ముఖ్యలక్షణము. కాలముయొక్క విలువ తెలియనివారినేఅజ్ఞులని మహనీయులైన విజ్ఞులు చెప్పుదురు.

2. ప్రకృతిగుణములైన కామాదులను సంపూర్ణముగా జయించుటయే ఆత్మసామ్రాజ్యమును పొందుటయగును. ప్రపంచము నందందరిని మెప్పించినీవేకార్యమును చేయజాలవు. కావున, సత్యమునుండి చలింపక నీయనుష్ఠానము నిర్విఘ్నముగా సల్పుము.

3. నీహృదయము శాంతినొందక, నీలోపల ప్రకృతి శమించకముందే నీవు శిష్యులను సంపాదించకుము. సంపాదించి నచో శాంతి గలుగనేరదు.

4. నీటిలో పడవయుండవచ్చునుగాని, పడవలోనికి నీరు రాకుండునట్లు చూడవలయును. అట్లే, సంసారములో నీవు యుండవచ్చునుగాని, నీలోపల సంసార ముండరాదు.

5. ధర్మనిష్ఠకు భయపడి, దేహపోషణసుఖమునే, జూచుకొనువాడు శూద్రు డనబడును. ఇంద్రియములను జయించుటకు శక్తి లేక భయపడి, ధర్మయుక్తమైన సంసారము గోరువాడు వైశ్యు డనబడును. ఇంద్రియశత్రువులను జయించి, ఆత్మరాజ్య

మును సంపాదించుటకు తపించువాడు క్షత్రియు డనబడును. ఆత్మ సామ్రాజ్యమును సంపాదించి, శాంతము, దయ, సమత్వము, ఆత్మ శాంతి గల్గియుండువాడు బ్రాహ్మణుడని చెప్పబడును.

6. శీతోష్ణములను సమానముగా జూచుట యనగా' కుంభవర్షములోను, గాఢమంచులోను ఎప్పుడు నిలచియుండుట యని యర్థముగాదు. మఱేమనగా, సామాన్యమైన ఎండవాన లకు కలతపడకుండా అనుష్ఠానము నిర్వహించుటయని భావము.

7. "ప్రజ్ఞానంబ్రహ్మ" అను భావము దెలిసినవారు ఆ స్థితిలోనుండి జారిపోవుటకు కారణ మేమనగా ఎవని మనస్సు దుస్సంకల్పములనుండియు, దుశ్చింతలనుండియు వెనుకకు మరల లేదో; మహావాక్యబోధయందు సమాధానస్థితి గలుగలేదో, అట్టివానికి ప్రజ్ఞానబ్రహ్మమందు నిలుకడ గలుగనేరదు. శుభా శుభ ద్వంద్వవిషయములలోనుంచి వేరై, ఆత్మస్వరూపము నందు ఉపరతిని పొందినవారికే ప్రజ్ఞానంబ్రహ్మ అను మహా వాక్యమందు నిలుకడ గల్గును. ఇట్టిజ్ఞానము గలిగినవారు శుభ కర్మల నొకవేళ త్యజించినను త్యజింపవచ్చును, తక్కినవారు త్యజింపరాదు.

8. ద్వంద్వములతో గూడిన సంసారమునందుండి విము క్తిని పొందదలంచినవాడు కేవల జ్ఞానయోగము చేతనే ఆత్మ సాక్షాత్కారమును పొందవలయును. అట్లుగాక, జపతపయోగ మార్గములచేత మనస్సును నిలుపదలంచినవారు ఎటువంటివా రనగా కొందరు పిల్లవాండ్రు ప్రవాహమందున్న పడవమీద ఎక్కి గూర్చుండి ఆపడవ ప్రవాహములో కొట్టుకొని పోవు

చుండగా నాపిల్లవాండ్రు పడవ కమర్చియున్న అడ్డకొయ్యలను బట్టుకొని ఆపదలంచిన నెట్లుండునో అట్లేయని తెలియవలెను.

9. స్వప్రయత్నము లేకుండా వచ్చిన సుఖదుఃఖములు ప్రారబ్ధ మనబడును. కర్తృత్వముతో గూడి చేసిన కర్మలు ప్రారబ్ధమని చెప్పవీలు లేదు. ఎట్లనగా, అధికముగా భుజించినందున జబ్బువచ్చినచో నది ప్రారబ్ధమనుట మంచిదిగాదు.

10. ఎవరు చక్కగా చదువుకొందురో, వారికి గొప్ప ఉద్యోగము వచ్చుచున్నది. చదువుకొనకపోయినచో ఉద్యోగము, వంశాచారముగా రానేరదు కదా! అట్లే ఎవరు బ్రహ్మమును తెలుసుకొనుచున్నారో వారికి మాత్రము బ్రాహ్మణత్వము వచ్చుచున్నదిగాని, బ్రహ్మమును తెలుసుకొనకుండానే వంశాచారముగా బ్రాహ్మణత్వము రాజాలదు.

11. ప్రజలను మోసపుచ్చు వేషములు వేసి, భక్తునివలె నటింపబోకుము.

సత్యమునుండి జారి ప్రజలను మెప్పించి నీవు సంతసింపదలంచకుము.

తనలోయున్న ఆత్మను గాంచలేనివాడు సర్వులలోనున్న ఆత్మను ఎట్లు చూడగలడు?

విషయచింత ఎప్పుడు గలిగినదో, అప్పుడే ఆత్మవినాశనమునకు హేతువని తెలియవలెను.

12. ప్రకృతిసంబంధమువలన గల్గుసుఖము సాలంబసుఖమనబడును. సర్వప్రకృతి శమించిన తదుపరి కలుగు సచ్చిదానందసుఖము నిరాలంబసుఖ మనబడును.

13. సాధనసంపత్తి లేక "అహంబ్రహ్మ" అనువానికంటె సాధనసంపత్తి గల్గి దాసోహమ్మనువాడు గొప్పవాడు.

14. దేహాభిమానముగలవాడై ఎవడు "అహంబ్రహ్మ" అను మహావాక్యమును వ్యాగ్రూపముగ ఎన్నిసారులు బల్కునో అన్నిపర్యాయములు, వాడు గుంటనక్కయై పుట్టునని మహర్షులు పల్కుచున్నారు.

ఎవడుఅధికారియైఒక్కసారి"అహంబ్రహ్మ"యని పల్కునో వానితో సమాను లీముల్లోకము లందును నుండజాలరు.

15. తక్కువ జాతివారిని ఉన్నత స్థితిలోనికి తీసికొనివచ్చు శక్తియున్నచో నాకార్యమునకు ప్రయత్నింపుము. వారిని పైకి దెచ్చుటకై పోయి నీవు వారిలో కలసిపోయినట్లైన ఆకార్యమునకు వెళ్ళకుండుటయే మేలు.

16, నిర్జీవము లన్నియు ప్రవాహజలములో కొట్టుకొని పోవునుగాని ఎదురీదజాలవు. ప్రాణముగల జీవులైనచో ఎదురీద గలవు. ఆలాగుననే జ్ఞానహీనుడు సంసార ప్రవాహములో కొట్టుకొనిపోవును. జ్ఞానచైతన్యము గలవాడు ప్రకృతి కెదురీది పరమాత్మను జేరగలడు.

17. కస్తూరిమృగము తననాభియందున్న సుగంధము పరిమళించుచుండగా ఆసుగంధము తనయందేయున్నదని యెఱుంగక, అడవియంతయు తిరిగి తిరిగి, వెదకి వెదకి, అలసి, యొక్కచోట పరుండి తనముక్కును నాభికి సమీపమం దుంచగా చాలినంత పరిమళము దొరుకుటచే నెట్లు తృప్తినొందెనో, అట్లే మానవుడును సుఖము తనయందున్నదని తెలియక ప్రపంచవిషయము

లన్నిటియందును వెదకి వెదకి, విసిగి, యొక్కచోట ఏకాంతముగా గూర్చుని మనస్సు నేకాగ్రముచేసి ఆత్మయందు నిశ్చలుడైనచో బ్రహ్మానందముచే తృప్తుడగుచున్నాడు.

18. ప్రపంచకోరికలను సమూలముగా నిర్మూలనముజేసి కేవలాత్మాకారస్థితిలో నెంతెంత నిలుకడ కలుగుచున్నదో వాని కంతంత సంకల్పసిద్ధి గల్గును. అయితే ఆత్మశుద్ధి గల్గువఱకు ఏ కోర్కెలను కోరగూడదు. ఒకవేళ తాను కోరిన సంకల్పములు సిద్ధించక పోయినచో నాకార్యము నెవరో చెడగొట్టినారని పరుల యెడ విరోధించగూడదు. అట్లగుటకు తన తపస్సుయొక్క దుర్బలత్వమే యని తలంచవలయును.

19. ఎవరినైననుజూచి, నీవెవ్వర వనినచో నేనునేనని అందరును చెప్పుదురు గాన అందరియందును నేననుపదార్థ మున్నట్లు గోచరించుచున్నది. ఆ నేననువస్తువును వెదకి విచారించబూనినచో నది దేహమేనని చెప్పెదమన్న దేహమును గూడా ఎఱుంగుచున్నది. కాన దేహమని చెప్పకూడదు. అట్లే మనోబుద్ధ్యాదులనుకూడా ఎఱుగుచున్నదిగాన వాటికన్నను వేరుగా యున్నదని చెప్పవలెను. అట్లే సూర్యచంద్రాదులను పంచమహాభూతములను ఎఱుగుచున్నదిగాన వానికన్నను వేరుగాయున్నదనవలయును. తత్ప్రకారముగా సర్వదృశ్యమును ఎఱుగుచున్నందున ఆత్మకు జ్ఞానత్వము సిద్ధించినది.

20. ఆత్మకు ఆనందత్వము కూడా గలదు. ఎట్లనగా పిపీలికము మొదలుకొని బ్రహ్మపర్యంతముగల సర్వజీవులును ఆనందముకొఱకే ప్రయత్నించుచున్నవి. దుఃఖము నేజీవియు కోరుట

లేదు. ఏలనన తానొకప్పుడు ఆనందమును ఎఱిగి అనుభవించి యుండుటవల్లనే ఆనందమును కోరుచున్నాడని చెప్పవలసి యున్నది. కాబట్టి జీవులు ప్రారంభములో ఆనందములోనుండియే వచ్చినవనియు ఆనందముకొఱకే ప్రయత్నించుచున్నవనియు, తుదకు ఆనందములోనే చేరవలసియున్నవనియు, చెప్పవలసి యున్నది. అందుచేత ఆత్మకు ఆనందత్వము సిద్ధించినది.

21. జాగ్రతావస్థ, స్వప్నావస్థయందు లేకపోవుచున్నది. స్వప్నావస్థ జాగ్రితావస్థయందు మిథ్యయగుచున్నది. జాగ్రత్స్వప్నంబులు రెండును సుషుప్త్యవస్థయందు లేకపోవుచున్నవి. ఇట్టి మూడవస్థలును ఒకదానిచేనొకటి కొట్టబడుచు ఒకదానినొకటి ఎఱుగలేక క్షణికములై తిరుగుచున్నవి. ఆత్మయన్ననో అవస్థాత్రియముల మూడింటి నెఱుంగుచు త్రికాలములయందును నశింపులేక స్వయంప్రకాశమై సత్తామాత్రమై యుంటున్నది. కాబట్టి ఆత్మకు సత్యత్వము సిద్ధించినది.

22. ఖురానులో మహమ్మదుగారు ఏమిబోధించినారనగా, ఇస్లాముమతమును ప్రేమించినవారిని నీప్రాణమువలె జూడమని చెప్పినారు.

బైబిలుగ్రంథములో క్రైస్తు ఏమిబోధించినారనగా నీవలెనే నీ పొరుగువారిని చూడమనిరి. బుద్ధుడు ఏమిచెప్పెననగా నీవుఎట్టిసుఖమును గోరుచున్నావో అట్లే సర్వజీవరాశియంతయు అట్టిసుఖమునే గోరుచున్నది గాన, చీమనైనను చంపకూడదని చెప్పిరి. ఓహో! బుద్ధభగవానుల మత మెంతవిశాలమైనదో చూడుడు.

వచ్చునుగదా! అలాగే పెట్టెలోయున్న పుల్లలన్నియు గీచి వెలిగించినచో ఎంత మహాగ్నియగునో చూడండి! అట్లే ఆ యణువు లన్నిటిని తపస్సుచే ప్రజ్వాలింపజేసినచో మహత్తరమైన సిద్ధులను, శక్తులను ఇచ్చుచుండును. కాబట్టియే గవర్నమెంటు వారు గొప్ప తెలివిగల్గినవారిశిరస్సులను పరీక్షించుటకై లక్షలు ధనమిచ్చి కొనుచుందురు.

25. ప్రతిమానవునికిని రెండు హస్తము లున్నవి. అందులో ఒక హస్తముచేత పరమాత్మను పట్టుకొనండి. వేరొక హస్తము చేత సంసారమును పట్టుకొనండి. ఒకకంటితో పరమాత్మను జూడండి. వేరొక కంటితో ప్రపంచమును జూడండి. అందువల్లనే పరమాత్మ మనకు రెండేసి అవయవము లిచ్చియున్నాడు. ఒక వేళ విడువదలంచినచో ప్రపంచమును విడిపించవలెను గాని, పరమాత్మను ఎప్పుడున్నూ వీడరాదు. పరమాత్మధ్యానము చేయనివాని జీవితము అడ్రసు లేని జాబువంటి దగుచున్నది. అనగా అడ్రసు లేని జాబుగతి యేమగునో వానిబ్రతుకును అట్లే యగునని ఎఱుంగుము.

26. ఎంతవఱకు నేను బ్రాహ్మణుడను, శూద్రుడను, నేను దేహముగలవాడను అను మర్త్యబుద్ధియుండునో అంతవఱకు జననమరణములు తప్పకయుండును. నేను కేవలము పరమాత్మ స్వరూపుడను. పై జెప్పిన కులవర్ణభేదాలు నాకు లేవని ఎప్పుడు చక్కగా ఎఱుంగునో అప్పుడుమాత్రమే జన్మరాహిత్యమగును.

27. స్థూలదేహారోగ్యముకొఱకు వేదమందు ఆయుర్వేదము చెప్పబడినది. సూక్ష్మదేహారోగ్యముకొఱకు జ్ఞాన

యోగము చెప్పబడినది. ఈరెండును వైద్యములే యగుచున్నవి. అయితే ఈరెంటికికూడా పథ్యము తప్పకయుండవలయును.

28. గురువుయొక్క ఆత్మలోయున్న భావమును తెలుసుకొని నటించువాడు ఉత్తమశిష్యుడు. కనుసైగను దెలసి ప్రవర్తించువాడు మధ్యముడు. వాక్కుచే ఒక్కసారి చెప్పినంతనే కార్యము చేయువాడు అధముడు. రెండుమారులు చెప్పవలసి వచ్చినచో వాడు గురుసేవకు పనికిరాడు. శిష్యునికి మొదటిపని గురుకార్యము చేయుటయు, రెండవపని, దైవపూజ, జపధ్యానములును, మూడవపని అతిథి అభ్యాగతులయొక్క సేవయు, తన పని నాల్గవదిగా ఎవడు గుర్తించునో వాడు ఉత్తమాధికారియని చెప్పబడుచున్నాడు.

29. ఎవరు అధికారులు గాకుండానే సన్యాసము గోరుచున్నారో వారిబుద్ధి ఎటువంటిదనగా కూలికి మట్టిపని చేసుకొనునొకవడ్డివాడు తాను కష్టపడి సంపాదించినడబ్బు సంసారఖర్చునకు చాలనందున అధికముగాసంపాదించగోరి కలెక్టరుపనికావలెనని కోరునట్లుండునని తెలియవలెను. అనగా తారకమే సాధించలేనివాడు అమనస్కమున కెట్లరుడగును?

30. ముఖ్యసారాంశమేమనగా మనస్సునందుండు భావమునేవాక్కుచేసత్యముజెప్పుటయు, వాక్కుచేతఏది చెప్పుచున్నావో ఆకార్యమును తప్పక కాయముచే చేయుటయు, జరుగునుగాన ఈమనోవాక్కాయములను మూడింటినే త్రిపుటియని పెద్దలు చెప్పుదురు. ఈత్రిపుటి ఎప్పుడు ఏకమగునో అదియే త్రిపుటి రహిత మనబడును. ఈత్రిపుటిగాక దీనికవ్వల వేరొక త్రిపుటి

గూడా యున్నది. మొట్టమొదట ఈచెప్పబడిన త్రిపుటిని జయించినచో తదనంతరము ఎన్ని త్రిపుటు లున్నను సులభముగా పటాపంచలు జేయవచ్చును. ప్రత్యక్షముగా గాన్పించుచున్న త్రిపుటినే జయించ లేకున్నవారు అతిసూక్ష్మమై అంతరాంతమందున్న మహాత్రిపుటిని రహిత మొనర్చినామని జెప్పినచో పెద్దలు హర్షించబోరు.

31. జ్ఞానయోగము, భక్తియోగము అను రెండు యోగములు గలవు. అందు జ్ఞానయోగము అతిసూక్ష్మాతి సూక్ష్మమైనది. అట్టి జ్ఞానయోగమునందు నిలువ లేకపోయినచో భక్తియోగమునే అవలంబింపవచ్చును. అయితే జ్ఞానయోగమున కెన్ని సుగుణము లుండవలయునో భక్తియోగమునకు గూడా అట్టి సుగుణము లన్నియు సంపూర్ణముగా నుండవలయును. భక్తిజ్ఞానములకు లక్ష్యములలో కొంచెము భేదముండునేగాని లక్షణములు మాత్రము రెంటికిని ఒక్కటేవిధమని తెలియవలెను. అయితే నారాయణస్మరణ జేయబోయి నరులస్మరణ చేయబోకండి.

32. సృష్టి అయినది మొదలు పరమాత్మకు ఇప్పటివరకు ముఖ్యభక్తులు అయిదుగురే దొరికినారట. ఆరవభక్తుడు ఇంతవఱకునుదొరక లేదట. ఆ ఐదుగు రెవరనగా ఆకాశము, వాయువు, అగ్ని, జలము, భూమి ఇవియే పంచభూతములు ఈఅయిదుగురు భక్తులును అనాదినుంచియు ఇప్పటివఱకును భగవదాజ్ఞ లవ లేశమైననుమీరక ఆచరించుచున్నారు. కావున భక్తులైనట్టివారు ఈపకారముగా భగవదాజ్ఞాబద్ధులు గావలెను.

33. చీకటియందు ప్రయాణము చేయునప్పుడు బ్రాహ్మణుడైనను, సన్యాసియైనను, చండాలుడైనను, దీపము చేతిలో యుండినచో, సుఖముగా ప్రయాణము చేయగలుగుదురు. ఎవని వద్ద లాంతరు లేదో వారు గుంటలో పడకపోరు. ఆలాగే జ్ఞానము కలిగినచో నెవ్వరైనను మోక్షము జెందుటకు సందియము లేదు. జ్ఞానజ్యోతి లేనిచో బ్రాహ్మణుడైనను నరక మనుభావిలో పడక తప్పదు.

34. మానవునికి నెలరోజులైనచో పితృదేవతల కొక్క దినమగును. అందుచేత అమావాస్యనాడు, పితరులకు తర్పణ జేసినట్లున వారికి ప్రతిరోజు భోజనముపెట్టినట్లే యగును. మానవుని సంవత్సరము దేవతలకు ఒక్కదినమగును. అందు వలన సంవత్సరమున కొక్కసారి యుత్సవము జేసినట్లైన వారికి ప్రతిరోజును జేసినట్లేయగును.

35. వేదాంతభాష మహాగంభీరమైనట్టిది. అందువలన మహాసూక్ష్మబుద్ధితో సంజ్ఞారూపముతో తెలుసుకొనవల యును. ఎట్లనగా టెలిగ్రాం భాష నోటితో మాటలాడక టకటకమని వ్రేళ్ళతో కొట్టెదరు. కావున, ప్రక్కస్టేషను మేష్టరుకు కూడా యాభాషవచ్చియుండినచో నర్థముజేసుకొనగలడు. ఆభాష తెలియనిచో ఎట్లు తెలుసుకొనగలడు? అట్లే గురుశిష్యులిరువురును వేదాంతపరిభాష తెలిసినవారై యుండవలెను.

36. శంకరరామానుజ మధ్వాది మహామతకర్తలందరును ఒకరిమీదనొకరు విరోధముచేత ఒకరిమతముల నొకరు ఖండించినవారుకారు. మరేమనగా, ఆయాదేశకాలములనుబట్టి జీవుల

యొక్క అధికారము ననుసరించి జీవులయొక్క మేలుకొరకే ఆయామతములను స్థాపించిరని తెలిసికొనవలయును.

37. ఒకరు అద్దమును చేతబట్టుకొని దృశ్యముతట్టు త్రిప్పియుంచినచో నా యద్దమునందు దృశ్యమే యగపడును. కాని, తన దేహ మేమాత్రము అద్దమునం దగపడనేరదుగదా, అట్లే అంతఃకరణమనెడి అద్దము దృశ్యముతట్టు త్రిప్పియుంచినచో ఎదుటనున్న దృశ్యమే యగుపడును గాని, తన స్వస్వరూపమైన ఆత్మ గానుపించనేరదు.

38. సముద్రజలము ఆవిరిరూపమున మేఘములోజేరి అచ్చటనుంచి వర్షరూపమున పర్వతప్రాంతములలో దుమికి చిన్న చిన్న కాలువలుగా ప్రవహించి నదీనదములలో ప్రవేశించి బహువేగముగా తన గమ్యస్థానమైన సముద్రము జేరువరకును మధ్యనెచ్చటను నిలువక పోవుచుండును. అయినను, కృష్ణాగోదావరి మొదలైన మహానదులకు అచ్చటచ్చట కొన్ని పుణ్యఘట్టములవద్ద అనేకజనులు స్నానములు, పూజాదులు జేయుచు, ఆ నదులను అధికముగా కీర్తింపుచుందురు. ఆనదు లాపూజాగౌరవములను మన్నించక అచ్చట నిమిషమైనను నిలువక సముద్రమునకు పోయి విశ్రమించునట్లు, సాధకులైన జిజ్ఞాసులుకూడా తమ స్వస్వరూపమైన పరమాత్మను జేరువఱకు ఎన్నిమతములు ఏర్పడినను, ఎంతమంది శిష్యు లేర్పడినను, ఎన్ని గౌరవములు గల్గినను తుదకు అణిమాదిమహాసిద్ధు లడ్డమువచ్చి ప్రార్థించినను, ఏ మాత్రము నిలువక తన గమ్యస్థానమైన బ్రహ్మానందములో విశ్రాంతి జెందువరకు మధ్య నిలువకూడదు.

39. మానవులలో మూడు రకములవా రున్నారు. ఎట్లనగా, ఎవ్వరును నాకంటే మించియుండకూడదనియు, అట్లధికులుగా యున్నచో వారియెడ అసూయగలవారు అధములని చెప్పబడుదురు. అందరున్నూ సమానముగా నుండవలయునని కోరువారు మధ్యములని చెప్పబడుదురు. అందరునూ నాకన్న మిన్నయై యుండవలెనని కోరువారు ఉత్తములని చెప్పబడుదురు. ఈ దినము కూలిజేసి రేపుకూలి యడుగువాడు ఉత్తముడని చెప్పబడును. రేపు జేయబోవుపనికై ఈదినమే కూలి దెచ్చుకొనువాడు అధముడని జెప్పబడును.

40. ఒక ఇంగ్లీషుపండితుడు (డార్విన్) మనజన్మమునకారంభము చేప జన్మమనియు, ఆమీద పక్షియనియు, తదుపరి కోతియనియు, ఆఖరున మానవజన్మముగా మారెననియు, ఇట్లు కొన్ని మార్పులు మాత్రము చెప్పెను గాని, మానవజన్మమునుంచి ఏ రూపంగా మారునదియు చెప్పక అక్కడికే ఆపివేసినాడు.

మన హిందూవేదములును, ఋషులున్నూ, మానవజన్మమునకుముందు ఎనుబదినాలుగులక్షల విధములుగా మారెననియు, తుదకు మానవుడైనాడనియు, ఇచ్చటనుండి తన గమ్యస్థానమైన పరమాత్మనుపొందు మార్గమధ్యములో యక్షకిన్నరసిద్ధవిద్యాధర దేవబ్రహ్మాది జన్మములైన మార్పులుజెందవలయుననియు, ఆమీద ముక్తిపదమును జెందుననియు చెప్పియున్నారు. మనమతము ఎంత విశాలమైనదో యోచించుడు.......

41. యదార్థమైన గురువువద్ద శిష్యత్వము చేయుట కత్తిమీద నడచుటకంటెను కష్టమని కబీరుదాసుగారు చెప్పి

నారు. ఎందువల్లననగా తను, ధన, మనములు మూడును గురువున కర్పించి తనకేమి కర్తవ్యములేక భృత్యుడై యుండవలయును. అట్లుగాక ఈశిష్యుడు లేకపోయినచో నాకెట్లుజరుగునాయని గురువుగారున్నూ, నేనులేకపోతే ఈమఠ మెట్లుజరుగునో చూచెదమనుకొనెడు శిష్యుడును యుండుట అశాస్త్రీయమని చెప్పబడును.

42. కొన్ని మఠములలో, మంచి భోజనములు, ఫలహారములు, బాగుగా దొరకుచుండును. శిష్యులందరును ఆ భోజన పదార్థములను సంతోషముగా భుజింతురు. అందులో కొందరు శిష్యులు ఫలహారములుమాత్రము సంపూర్ణముగా భుజింతురు. కాని, ఏదైన పని చెప్పినచో పండుకొని మూల్గుచుందురు. వారెట్టివారనగా, దొంగఎద్దులవంటివారని చెప్పబడుదురు. ఎట్లన కొన్నిఎద్దులు మేతమాత్రము పూర్ణముగా తినును.నాగలి గట్టినచో పండుకొనును. అట్టివారు లోకములో గౌరవింపబడనేరరు. వారికిన్ని సుఖములేదు. ఎట్లనగా చక్కగా శుద్ధముగా బెరిగిన కొయ్యలే గొప్ప ఖరీదుగలవి యగును. వంకరగా యుండునవి అంతఖరీదు గావుగదా!

43. ఒక రాజునకు నేత్రములు జబ్బుచేసి బహు బాధ పడుచుండెను. ఒక వైద్యుడువచ్చి నీవు పచ్చని వస్తువులనే చూచుచుండినచో ఈబాధ తగ్గిపోవునని చెప్పి వెళ్ళెను. అప్పుడా ప్రభువు తనకోటలోయున్న మేడల కన్నిటికిని కొన్నిలక్షలు ధనమును ఖర్చుబెట్టి ఆకుపచ్చరంగు వేయించెను. ఆ రంగును జూచుటచే రాజునకు కొంచెముబాధ తగ్గుచుండెను. ఎప్పుడైనను

పొరపాటుచే ఇతరరంగులను జూచినచో బాధ హెచ్చుచుండెను. ఒక్కనాడు ప్రభువుగారి గురువు వచ్చి ఈ వర్తమానము రాజుచేత విని ఓ రాజా బ్రహ్మాండమున కంతయు పచ్చరంగు వేయించుటకు నీచేతనగు పనిగాదు. నే నొక చిన్న సదుపాయము జెప్పెద వినుము. ఆకుపచ్చరంగుగల కళ్ళజోడు ఒక్కరూపాయకు దొరకును. ఆజోడు కళ్ళకు బెట్టుకొన్నచో జగమంతయు ఆకు పచ్చగానే తోచునని చెప్పి ఆప్రకారము జేయించెను. రాజుగారు గురువుగారియొక్క బుద్ధివికాసమునకు బ్రహ్మానందముపొంది నమస్కరించి బహుమతులుకూడా ఇచ్చెను. అట్లే ఎవ్వరైనను ప్రపంచమంతయు శుద్ధసత్వపరబ్రహ్మముగా చేయవలెనని శ్రమపడుట సాధ్యముగుపని గానేరదు. కాన తన హృదయము పరిశుద్ధము చేసుకొన్నచో ప్రపంచమంతయు శుద్ధముగానే గోచరించును.

44. భర్తయనగా భరించువాడని యర్థము. ఒకస్త్రీకి యొకపురుషుడు భర్తయగుచున్నాడు. భర్తకుగూడా మఱియొక భర్తయున్నాడని తెలియవలెను గాన, సర్వ బ్రహ్మాండములను భరించు భర్తయొకరు గలరని మఱువగూడదు. అట్టి పరమాత్మను భర్తగా వరించినట్లైన యాభర్త చనిపోవువాడు కాడు. కాబట్టి ఎప్పటికిని సుమంగళులై యుందురు. శాశ్వతసుఖమును పొందుదురు. అట్లుగాక ఇహలోకభర్తలనే నమ్మినచో వారొక నాటికి చనిపోవుట నిజము. అప్పుడు విధవత్వము, దుఃఖమున్నూ రాకతప్పదు. ఇట్టిభర్తలు అనంతజన్మములలో నెందరైయుందురో గాన యీ భర్తలందరును స్వప్నావస్థలోగలుగు భర్తలెంతో వీరున్ను అంతియేనని తెలియవలెను.

ఇట్లు చెప్పుటచేత ఇహలోకపు భర్తలను విడిచి పెట్టమని అరముగాదు. దేహపోషణకై ఇహలోకపు యీ భర్తయున్నూ, ఆత్మరక్షణకు పరమాత్మయున్నూ, వీరిరువురు యుండుటమంచిది. ఇహలోకపు భర్త లేనివారు కేవలము పరమాత్మనే నమ్ముకొనుట మేలు.

45 భక్తిలో నాలుగురకములవారున్నారు. ఎట్లనగా శైవవైష్ణవాద్యనేకమతస్థులు ఒకరిమతము నొకరు నిందించుకొనుచు,ఒకరిదేవత నొకరుఅసహ్యించుకొనుచు తుంటకు కంటితోనైనను ఇతరదైవములను చూచుట కిష్టపడకుందురు. ఇది కేవల సంకుచితభక్తి యనబడును. తమమతమును తమఇష్టదైవమును వీడక తక్కినమతములను వారిదైవములనుగూడా సమత్వముగా జూచుట, మధ్యమభక్తి యనబడును. సర్వశరీరములందును వెలుగుచున్న ఆత్మయే పరమాత్మయని తెలిసి అట్టి విశ్వరూపమును ధ్యానించుటయు, ప్రేమించుటయు ఉత్తమభక్తి యనబడును. దృశ్యమును దృక్కును అంతయు పరమాత్మస్వరూపమే యనెడి పూర్ణావస్థను బొందుట కేవల ముత్తమోత్తమమని చెప్పబడును.

46. వేదమునందు పూర్వకాండయనియు నుత్తరకాండయనియు రెండుభాగములు గలవు. అందు పూర్వభాగమంతయు ధర్మార్థకామముల కుపయోగమగు కర్మ కాండనుదెల్పుచున్నది. రెండవభాగమగు నుత్తరకాండమంతయు మోక్షస్వరూపమైన నివృత్తిమార్గమును బోధించుచున్నది.

47. బుద్ధభగవానులు నిర్వాణమను పదమును లక్ష్యార్థముగా జెప్పినారని ఇతరమతస్థులు కొందఱు నిర్వాణమను పద

మునకు శూన్యమని అర్థముజేసి బుద్ధభగవానులను శూన్యవాదియని చెప్పినారు. శ్రీకృష్ణపరమాత్మ భగవద్గీతయందు నిర్వాణపదమును నాలుగైదుచోట్ల వచించియున్నారు. ఇదిగాక శ్రీశంకరాచార్యులవారు నిర్వాణషట్కమని కొన్ని శ్లోకములనే చెప్పియున్నారు. నిర్వాణపదమునకు శూన్యార్థమైనచో శ్రీకృష్ణభగవానులున్నూ శ్రీజగద్గురు శంకరాచార్యులున్నూ చెప్పుదురా! మరేమన ఆకాలమునందు బ్రాహ్మణులు రాజులచేత జీవహింసారూపమైన యజ్ఞములను విశేషముగా జేయించుచుండిరి. అట్టి హింసారూపమైన యజ్ఞములను బుద్ధభగవానులు ఖండించి నిలిపివేయించినందువలన బ్రాహ్మణులు బుద్ధమతము శూన్యమతమని ప్రచారము చేసిరిగాని బుద్ధభగవానులు నవమావతారమని మనదేశములో ప్రసిద్ధియైయున్నది.

48. భగవద్గీతయందు కృష్ణభగవానులు ఆఖరున మోక్షసన్యాసయోగమే చెప్పినారు. శ్రీరామచంద్రుడును ఆఖరున సర్వసంగపరిత్యాగియై సన్యసించెను. పంచపాండవులును అంత్యదశయందు సన్యసించినట్లే యున్నది. కాబట్టి ఆఖరున ప్రతివారును సన్యాసము పొందవలయును. అయితే అధికారులైన వారికే సన్యాసము చెప్పబడెను. అధికారి గాకుండానే బాహ్యసన్యాసము తీసుకొన్నచో వాడు ఉభయభ్రష్టుడగును. బాహ్యసన్యాసము కన్నను, సంకల్పసన్యాసము గొప్పది. దానికన్నను అవిద్యాసన్యాసము ఇంకా గొప్పది. ఈ మూడు సన్యాసములను ఎవరు సంపూర్ణముగా ధరించినారో వారు సంపూర్ణసన్యాసి యని చెప్పబడుదురు.

49. పూర్వజన్మమునందు పుణ్యముజేసినవారే ఇప్పుడు ప్రపంచములో సమస్తభోగభాగ్య సుఖములు గలిగి యున్నారు. పూర్వజన్మమునందు పాపముజేసినవారే ఇప్పుడీ ప్రపంచములో ఏ సుఖములు లేక దరిద్రముచే బాధపడుచున్నారని తెలియవలెను. పుణ్యాత్ములైనవారికి పుణ్యమైన సంతోష కార్యములు చూచినప్పుడు ఆనందము పొంగుచుండును. పాపాత్ములకు మంచిపుణ్యకార్యములు చూచినప్పుడు వారి నేత్రములకు మహాబాధ కలుగుచుండును. ఎట్లనగా, దీపప్రకాశము, మనోహరమైనదైనను కంటిరోగము గలిగినవారికి మహాబాధ గలిగించునుగదా!

50. మనదేశమునందు లోకోద్ధారకులైన మహాపురుషులనేకులు పుట్టిరి. వారందరును మాతల్లి పవిత్రురాలగుట వల్లనే అట్టి పవిత్ర గర్భములో పుట్టుటచేతనే మాకు లోకసేవ జేయునట్టి పవిత్రబుద్ధి పుట్టుటకు కారణమైనదని వారివారి తల్లులను అధికముగా పొగడుకొనిరి. కాన, స్త్రీ హృదయమెట్లుండునో అట్టి పుత్రులే పుట్టుదురు. కాబట్టి లోకమును చెఱచుటకుగాని, బాగుపఱచుటకుగాని స్త్రీలయొక్క పవిత్రాపవిత్రతలే కారణములైయున్నవి.

51. మనదేశమునందు ఏ దేవుని పేరు చెప్పినను, ఏ మహాపురుషుని పేరు జెప్పినను, ముందు స్త్రీ శబ్దమే వచ్చుచున్నది. అదెట్లనగా లక్ష్మీనారాయణ, గౌరీశంకరులు, సీతారాములు, స్త్రీ పురుషులు, తల్లిదండ్రులు. ఇట్లు ప్రతిపదమునకును స్త్రీ పదములే ముందు వచ్చుచున్నవి. ఇది చూచి విచారించి పాణిని మొదలైన మహావ్యాకరణవేత్తలు మొదట స్త్రీ

పదమును తీసివేసి పురుషపదమును కుదుర్చుటకై చాలాశ్రమజేసి చూచినను, వ్యాకరణము కుదురలేదట. అందువలన ఆ స్త్రీ పదము ముందు యుంచుట దైవాజ్ఞయని అట్లే యుంచినారట. గాన స్త్రీయే ముఖ్యమని ఎఱుంగవలెను.

52. పుణ్యాత్ములయొక్క మనస్సు, వాక్కు, తనువు, ధనము లన్నియు పుణ్యకార్యములకే ఉపయోగపడుచుండును. పాపాత్ములయొక్క తను, మన ధనములు పాపకార్యములకే ఉపయోగ పడుచుండును. పుణ్యాత్ములమనస్సు ఎప్పుడును ప్రశాంతముగాను ఆనందముగాను యుండును. పాపాత్ముల హృదయ మెప్పుడును చింతలచే కొట్టబడుచుండును.

53. భగవంతుడు అందరియందును సమానముగా యున్నాడు కాని, భగవంతునియందు అందఱును సమానముగా లేరు. భగవంతునిమీాద భక్తిగలిగినవారు చాలామంది యుండవచ్చునుగాని, భగవంతునిదయను సంపాదించినవారు అరుదుగా యుందురు.

54. రాజు యను పదమునకు అర్థమేమనగా ధర్మదీక్షగల్గి సమస్తజనులయొక్క కష్టములు తొలగించి, సంతోషముగలిగించి సర్వమానవులయొక్క హృదయములను రంజింపజేయువాడు గాన రాజు యనుపేరు గల్గెను.

55. ఒక మనుష్యుడు బుద్ధభగవానుని జూచి, స్వామిా! భగవంతుడున్నాడా? యని అడుగగా వారిట్లనిరి. "భగవంతుడు ఉండుట లేకుండుట అట్లుండనిమ్ము. దానివలన మన కేమియు లాభము లేదు. మనహృదయమాలిన్యమే మనల నమితబాధలను పొందజేయుచున్నది. అందువలన నీ అంతఃకరణము శుద్ధము

జేసికొనుట మేలు. అందుకు నీవు అధికారివి కాకపోయినచో నీకు ఏది సుఖమో సర్వజీవులకును అదియే సుఖము. నీ కేది దుఃఖమో సర్వజీవులకును అదియే దుఃఖము అని తెలిసి ఏజీవి కిన్ని కొంచెమైనను దుఃఖము గలుగనీయక ప్రవర్తించినచో దేవు డున్నది లేనిది అంతయు నీకే తెలియు''నని చెప్పిరి.

**56.** మనువుయొక్క సంతతివారైనందుచేత మానవులని పిలువబడుచున్నారు. అగ్రజాతి మొదలు అంత్యజాతివఱకును ఏదేశమువారలైనను మానవులనియేపిలువబడుచున్నారు.కులము లనునవి మధ్యలో ఏర్పడినవియే. ఎట్లనగా మహమ్మదు వచ్చి నప్పటినుంచి మహమ్మదు కులమును, క్రీస్తువు వచ్చినది మొదలు క్రైస్తవ కులమును, బుద్ధుడు వచ్చినది మొదలు బౌద్ధ కుల మును, ఇట్లే అనేకశాఖలు మన మెఱిగినంతలోనే ఏర్పడినవిగదా. అట్లే అన్నికులములును ఆయా కాలములందు ఏర్పడినవే కాని, దైవసృష్టిలో వచ్చినవి కావు. కాబట్టి మానవు లందఱును, ఒక్కటే కులముగా యుండవలయుననియే మాయొక్క ముఖ్య ఉద్దేశము. అయితే అందఱును శుచ్యాచారములు మాత్రము చక్కగా కలిగియుండవలయును.

**57.** ధ్యాననిష్ఠలు జేయువారు ఏకాంతస్థలమునందు కూర్చుండి రహస్యముగా జేయవలయును. కొందఱట్లుగాక, అనేకజనులు కూర్చున్నసభలయందు పద్మాసనమువేసి, నడుము నిక్కించి, వెన్నువిఱచుకొని, నిమీలితనేత్రులై ఏమో తెలిసిన వారివలె ముందు వెనుకలకు యూగుచుందురు. అట్టి వారం దరు డాంబికులని చెప్పబడుదురు బాగుగా తెలిసినవారు ఏకాంతస్థలమునందు రహస్యముగా గొప్పధ్యానముచేసియు, ఒక

సభామధ్యమున కూర్చున్నప్పుడు సామాన్యముగానే యుందురు. అది ఎట్లనగా, తిరునాళ్లు జరుగు స్థలములలో వీధులయందు గిల్టెటుసొమ్ములు కుప్పలుకుప్పలుగా ప్రోగులుపోసి అమ్ము చుందురు. బంగారునగలను, రత్నహారములను అట్లు వీధులలో అమ్మరుగదా! ఆప్రకారముగా ధ్యాననిష్ఠలను సభలలో ప్రదర్శించినచో తపస్సునకు గౌరవము పోగొట్టినవా రగుదురు.

58. ప్రపంచములో మన స్వార్జితమునకు ఎవ్వరైనను అడ్డుదగిలినచో కోర్టుకుపోయి ఎంతకష్టమైనను ఎంతధనము ఖర్చయినను పోట్లాడి ఎట్లు మనపక్షము జేసుకొనుచున్నామో ఆ ప్రకారమే పరబ్రహ్మమైన మోక్షధనమునకై, ఏలకష్టపడుట లేదు. ఈరెండును మనకు స్వార్జితములే యగుచున్నవి. అయితే, ఈ రెంటియందును అధికార మున్నది గాని, మైనరు తీరనివారికిమాత్రము కోర్టువారు ఆస్తిని స్వాధీనము చేయరు. ఆలాగుననే ఎంతవఱకు అజ్ఞానులుగా యుందురో వారు జ్ఞానధనమునకు అధికారులు కానేరరు.

59. ఆత్మకు రెండవవస్తువు యుండునంతవఱకు, దుఃఖముండియే తీరును. ఎట్లనగా, ఎలుకకు పిల్లి యుండునంతవఱకు దుఃఖము తప్పదు. జింకకు పెద్దపులి యుండునంతవఱకు, శోకరహితము గానేరదు. ప్రభువునకు పరప్రభువు యుండువఱకు, చిత్తశాంతి యుండనేరదు. దేవతలకు రాక్షసులుండువఱకు, సౌఖ్యము లేదు. అందుచేత ఆత్మకు ద్వైతభావన యుండునంతవఱకు, చిత్తోపరతి గలుగనేరదు. కాబట్టి పరమాత్మస్వరూపుడ నగు నాకంటే అన్యవస్తువు బొత్తుగా లేదు అని తెలియువఱకు సంపూర్ణానందము లేదు. అందుచేత ఈసర్వదృశ్యమంతయు

మిథ్యామాత్రమని సర్వకాలసర్వావస్థల యందును, దృఢ ధ్యానముతో నుండవలెను. అట్లుగాక యోగాభ్యాసాదుల చేత, కొంతసేపు దృశ్యరహితస్థితిలో నుండి, మరల వ్యవహార స్థితికి వచ్చినప్పుడు దృశ్యము నన్నేమి చేయునోయను భయ ముండును. ఎట్లనగా, ఒకమనుష్యుడు నాగుబాముయొక్క కంఠమును గట్టిగా పట్టుకొని విడువకున్నను విడిచిపెట్టితే, కఱచునేమోయను భయ ముండును. అట్లుగాక, పామును సంపూర్ణముగా చంపివేసితే నిర్భయమైనట్లు, ఈదృశ్యము నంతయు సంపూర్తిగా మిథ్యాస్వరూపమని జూచుటతో, లేక సర్వము పరమాత్మస్వరూపమేయని గాంచుటతో యుండవలెను.

60. మనుష్యులలో ఆరుతరగతులవారుందురు. అదియెట్లనగా మొదటివాడు తనసుఖమునుమాత్రమే తాను చూచుకొనుచుండును. రెండవవాడు, తనసుఖమును తనభార్యాబిడ్డలయొక్క సుఖమునుమాత్రమే చూచుకొనుచుండును. 3 వవాడుతనను,తన భార్యాపుత్రాదులనేగాక, తనబంధుమిత్రాదులయొక్క సుఖమును కూడా చూచుచుండును,నాల్గవవాడు,తనజాతివా రందరిని ప్రేమించును. అయిదవవాడు తనజాతివారినే కాక తనదేశము వారందరిని ప్రేమించును. ఆరవవాడు సర్వజాతులను సర్వదేశీయులను అందరిని సమానముగా ప్రేమించును. ఇట్టివారే ఉత్తమమనుజులని చెప్పబడుదురు.

61. జలమునందు విద్యుచ్ఛక్తి కలదు. ఆశక్తి నీటియొక్క విస్తీర్ణమునుబట్టి యుంటున్నది. ఒక పంచపాత్ర నీటి యందు ఒక చిన్నపురుగు పడినచో యా నీళ్లు పారబోయుచున్నాము. ఎందువల్లననగా—

ఆ నీటియందు దాపురుగుయొక్క మాలిన్యమును పోగొట్టుకొనునంతటి విద్యుచ్ఛక్తి లేనందువల్లనే యని తెలియవలెను. ఒక పెద్ద చెఱువునీటియందు గొప్పచేపగాని లేక మనిషిగానిపడి చనిపోయినచో యీ చెఱువు నందున్న విశేషజలములో గొప్ప విద్యుచ్ఛక్తి యుండుటవలన యీ మలినము హరించివేయబడు చున్నది. వర్షాకాలమునందు మహానదులన్నియు ప్రవహించు నపుడు అందుఅనేకజీవజంతువులును అనంతకల్మషముకొట్టుకొని వచ్చి చేరినను, సముద్రము ఆ మహాకల్మషమునంతటిని హరింప జేయుచున్నది.అట్టి మహాసముద్రముయొక్క శక్తి పంచపాత్రకు, భావికి, గుంటకు రావలెనన్న ఎట్లు వచ్చును? అట్లే గొప్ప సిద్ధ పురుషులు జేయునట్టి ఘనకార్యములను జూచి శక్తిలేనివారు అట్టికార్యములకు పూనుకొన్నచో ప్రయాస గలుగునేగాని అవి ఫలించనేరవు.అందువలన వారివారిశక్తిని గనిపెట్టి నడుచుకొనుట మంచిది.

62. అరణ్యమునందు వెదురు పొదలుండును. వానిలో ఎండిపోయిన వెదుళ్లకు తుమ్మెదలు రంధ్రములు దొలచును. గాలి బాగుగా దోలునప్పుడు యీ వెదురురంధ్రములగుండా మంచి సునాదము బల్కుచుండును.అప్పుడాయరణ్యమునందున్న జింకలు యీ వేణునాదమును విని వెదకులాడుచు గుంపులు గుంపులుగా యీ పొదవద్దకు వచ్చినిలిచి యీ నాదానందమును వినుచుండును. ఇంతలో గాలి యాగిపోయినచో యీ నాదము నిలిచిపోవును. అప్పుడా జింకలన్నియు వెళ్లిపోవును.మరల ఆ గాలి చేత వేణునాదము బలికినచో వెంటనే జింకలన్నియు వెనుకకు మరలివచ్చి యీనాదము వినుచుండును. అట్లే బ్రహ్మానంద

మనెడి వేదశ్రుతినాదము వినుటకై జిజ్ఞాసువులైన జనులుఋష్యాదులవద్దకు వచ్చి వినుచు పోవుచుందురు.

63. ఏకాంత మనగా మనుష్యు లెవ్వరును లేనిచోటని అర్థముకాదు.ఏసంకల్పములు లేని చోటయుండుటే యని అర్థము. ఏసంకల్పములు లేనిచోట దృష్టియుంచువాడు అనేకమనుష్యులలో యున్నను వాని కది నిర్జనస్థానమే యగుచున్నది.

సంకల్పములు గలవాడు ఎవ్వరును లేని నిర్జనస్థానమందున్నను ఎన్నిసంకల్పములు గలుగుచున్నవో అంతమంది మనుష్యులలో యున్నట్లే యగును.

64. ఏ మానవుడు కాలమును నిర్లక్ష్యముగా జూచుచున్నాడో వాడుపరమాత్మనునిర్లక్ష్యము జేసినవాడగుచున్నాడు. ఎందువల్ల ననగా గీతయందు కాలము నేనని భగవంతుడు చెప్పియున్నాడు. కావున నీవు భగవంతుడిచ్చియున్న కాలమును వృథా చేయకుము. ఇదిగాక మత్స్యములలో మకరము నేననిచెప్పినాడు. ఎందువల్ల ననగా సముద్రమునందు మకరమను నొక జాతి చేపలు కలవు. చేపలు వేటాడువారికి నొక వేళ యీమకరమనెడి మీనము వలలో చిక్కినను దానిని వారు చంపక విడిచివేసెదరు ఎందువల్ల ననగా సూర్యుడుదయించునప్పుడుయీచేపతూర్పుగామళ్ళిసూర్యనమస్కారములు జేయుననియు,యెవ్వరా చేపను చంపి తినెదరో వారికుటుంబము నాశనమగుననియు, అన్నిమత్స్యములవలె ఈ చేప ఇతరమైన చిన్న చేపలను తరిమిచంప తినదనియు, దానివద్దకు వచ్చినవానినేతినుననియు జాలరులు కొంతమంది చెప్పుచున్నారు.

65. నాలుగువేదములును వేదాంగములును కంఠస్థముగా చదివినను అనుభవమును ఆచరణయును లేకున్నచో యీ

చదువులన్నియు ఏమాత్రమును లాభము లేదు. అందుచేత చదువు అనవసరమని మేము చెప్పట లేదు. మరేమనగా రెండును యుండుట మంచిదని చెప్పుచున్నాము. కొందరు కొన్ని శాస్త్రములుమాత్రము చదివి మాకు తల ఉడుకెక్కినది, ఈశాస్త్రములన్నియు మాకెందుకు; మాకు మోక్షముకదా కావలెను అని అనుచుందురు. అది ఎట్లున్నదనగా ఒకరు గొప్పయాకలిబాధతో నుండియు, మా యాకలిదీరుటకు ఈపాత్ర్యము యెందుకు, నిప్పు నీళ్లు ఎందుకు, ఈపొగలును సెగలును ఎందుకు, మాకు కావలసినది పిడికె డన్నమేకదా యని అన్నట్లుగా యుండునని తెలియవలెను.

66 లక్షరూపాయలు ఖర్చుబెట్టి ఒకశృంగారమైన గొప్ప దేవాలయము గట్టించి యాగుడిలో దేవునిప్రతిష్ఠ జేయకపోయినచో యాదేవాలయమును కట్టించినపుణ్యమును, ఆమానవు డెట్లు పొందజాలడో ఆప్రకారముగానే శ్రేష్ఠమైన మానవజన్మము గల్గియు, సకలశాస్త్రములను చదివియు మహాభోగభాగ్యములుండియు దివ్యరూపసౌందర్యము దొరికియు తనదేహమునందును సర్వదేహములందును వెలుగుచున్న పరమాత్మను దెలియనివాడు సంపూర్ణమైనమానవజన్మము గలిగినవాడు కాడు. ఏదేహమునందు దేవుని ప్రతిష్ఠ జేసుకొనియుందురో అట్టి మహనీయు లున్నచోట చక్కగా దైవప్రతిష్ఠ జేసిన దేవాలయమువలె ఎప్పుడును అనేకజనులు కూడి సంతర్పణలు సమారాధనలును, విశేషముగా జరుపుచుందురు. ఎవ్వని హృదయమందు దేవుని ప్రతిష్ఠ జేసియుండలేదో వారెక్కడయున్నను పాడుబడిన దేవ

స్థానమువద్దకు ఎవ్వరును ఎట్లు పోజాలరో అట్లే బూటకపుభక్తుల వద్దకు ఎవ్వరునూ రాజాలరు.

67. మనోవాక్కాయములు మూడును పరమాత్మను ఎఱుగజాలవు. ఏలననగా ఈమూడును జడములు. పరమాత్మ చేతన స్వరూపము అందువలన జడవస్తువులు చేతనమునెట్లెఱుంగగలవు అందుచేత పరమాత్మ అవాఙ్మానసగోచరుండని చెప్పుటకు కారణమైనది. అట్టి మనోవాక్కాయములకు అతీతమైన పరమాత్మస్వరూపము అధికారులు గానివారికి సాధ్యముగాదు. కావున అభ్యాసకులైనవారికి చిత్తశుద్ధిగలుగుటకొఱకై మహర్షులైనవారు సగుణారాధనములైన పూజాధ్యాన జపతపయోగాది సాధనములు నిర్మించినారని తెలియవలెను.

68. మాసములలో మార్గశీర్షమాసము శ్రేష్ఠమని భగవద్గీతయందు జెప్పబడియున్నది. ఏలనన లోకకల్యాణములైన జపతపములు జేయుటకుగాని యజ్ఞయాగాదులు జేయుటకుగాని ఎండాకాలమున వేడియధికముగానుండును. చలికాలమునచలిఅధికముగానుండును. అందుచేత ఈరెండుకాలములునుఅంతయోగ్యములుకావు. మార్గశీర్షమాసము శీతోష్ణములకు మధ్యకాలమగుచున్నది. ఇదియునుగాక యజ్ఞములుజేయుటకు కావలసిన ధాన్యములును కూరగాయలును సరస్సులలో సంపూర్ణ జలములును అన్నియు సంపూర్ణముగానుండును. కావున మార్గశిరమాసము ముఖ్యమని చెప్పబడుటకు కారణమని తెలియవలెను

69. బజారులో బంగారునగలను అమ్మినచో, అమ్మినవారికిని కొన్నవారికిని, ఆనందము, గౌరవమును కలుగును. అట్లుగాక

ఒకానొకడు గిల్టునగలను దెచ్చి, అమాయకులైన మనుజులను మోసముజేసి, బంగారునగలని జెప్పి, విక్రయించినచో అమ్మిన వారికిన్ని, కొన్నవారికిని అపకీర్తియు, అనేకదుఃఖములును గలుగును. ఆరీతిగానే శుష్కవేదాంతమును నిజవేదాంతమని చెప్పి, అమాయకులను మోసముజేసినచో ఉభయులకును దుఃఖము తప్పదు.

70. సూర్యోదయకాలమున మనదేహముయొక్క నీడ చాలా పొడవుగా గాన్పించును. సూర్యుడెంతెంత పైకి వచ్చుచుండునో అంతంత నీడ తగ్గితగ్గి తుదకు తన పాదముల క్రిందనే లయమౌను. అట్లే జ్ఞానోదయప్రారంభకాలములో మన మనస్సు ఎంతో పొడవుగాను చాలా పెద్దదిగాను ఘోర భయంకరముగాను గాన్పించును. జ్ఞానసూర్యుడెంతెంత పైకి వచ్చుచుండునో, అంతంత ఈమనోరూపమైన మాయ తగ్గితగ్గి తన స్వస్వరూపమైన పరమాత్మయందే లయించిపోవుచున్నది.

71. తన దేహమునే ఎఱుగలేని గ్రుడ్డివాడు ఇతరుల దేహముల నెట్లెఱుంగజాలడో, అట్లే తనదేహమునందున్న పరమాత్మను దెలియలేని అజ్ఞాని ఎన్ని నదీనదములు దిరిగినను పరమాత్మను దెలియజాలడు. అట్టి పరమాత్మసాక్షాత్కారము గలుగవలయునంటే పరమేశ్వరుని దయ సంపాదించవలయును. పరమాత్మదయ గలుగవలయునంటే పరమేశ్వరుడు లోకమునకు విధించిన దైవాజ్ఞను పాటించినవారికే తప్ప ఇతరులకు ప్రాప్తించ నేరదు. ఎట్లనగా రాజాజ్ఞను ఉల్లంఘించుచు రాజుయొక్క దయను కోరుట ఎట్లుండునో దైవాజ్ఞయు నట్లేయని ఎఱుంగవలయును.

72. ఒకానొకనికి క్రొత్తప్రదేశములకు పోయినప్పుడు తూర్పుపడమరగాను, పడమరతూర్పుగాను కనిపించుచుండును. ఇది అందరికిని అనుభవమేయగును. అయితే ఎవ్వనికి భ్రమగల్గెనో వానికే అట్లు తారుమారుగా గానుపించునుగాని అచ్చట కాపురముచేయుచున్న వారందఱికిని అట్లే గాన్పించుచున్నదని చెప్పదగదు. తక్కినవారందరికిని యదార్థమే గాన్పించుచుండునుగదా!

73. మహా వైరాగ్యమును, ఆత్మసాక్షాత్కారమును, గలిగిన గురువు దొరకుట, శిష్యునియొక్క పుణ్యమేయగుచున్నది ఎట్లనగా, రైలు, ఇంజనుకు తగిలించిన పెట్టెలు, అన్నియును. ఇంజనుయొక్క వేగమును బట్టియే పోవుచుండును. కొందరు ప్రయాణీకులు తొందరగా ప్రయాణము చేయవలెనను ఉద్దేశ్యము గల్గియు, నిదానముగా బోవు బండి ఎక్కినచో ఆ ఇంజనుయొక్క వేగము ననుసరించియే రైలుపోవును గాన త్వరగా పోజాలరుగదా! అట్లే వైరాగ్యములేని గురువును ఆశ్రయించినచో శీఘ్రముగా మోక్షమునకు బోజాలరు.

74. పాపాత్మునికి పరమాత్మ విరోధుడుగా గాన్పించును. పుణ్యాత్మునికి ప్రపంచకార్యములు విరోధముగా గాన్పించును. ఎట్లనగా ఒకరోగికి ఎప్పుడు అన్నముమీద ఇచ్ఛగలుగునో అన్నము రుచించునో అప్పుడువానికి వానిరోగము తగ్గినదని తెలుసుకొనవచ్చును. ఎంతవఱకు అన్నముమీద ఇచ్ఛయు ఆకలియు రుచియు కలుగలేదో వానికి రోగము తగ్గలేదని తెలియవలెను.

75. భగవంతుడు దయామయుడును జగద్గురుడనియు కూడా చెప్పబడియున్నది. కాన భగవంతునే గురువుగా నమ్ముకొని కడతేరవచ్చునుగాని, ఆ మార్గమెట్లుండుననగా ఎన్నడును

ఎఱుగనిమార్గమున తానొక్కఁడే ప్రయాణమైనచో ఎంతకష్టమో ఆరీతిగా యుండును. సద్గురువుద్వారా మోక్షము జెందుట ఎట్లుండుననగా, ఇదివఱకు మార్గము దెలిసినవారితోఁగూడా ప్రయాణముజేసినచో, ఎంతసులభముగా నుండునో ఆరీతిగా యుండునని తెలియవలెను ఈరెండుమార్గములకును ఇంతతార తమ్య మున్నది.

76. రాజభటులవద్ద తుపాకులును, కత్తులు, కర్రలు యుండును. అవి యెందుకనగా రాజాజ్ఞను మీరి ప్రవర్తించు దుష్టులను శిక్షించుటకేయగును. అట్లే భగవంతునిచేతులయందు చక్రము, గదమొదలైన ఆయుధము లుండును. అవి ఎందుకనగా ఎవరు దైవాజ్ఞనుమీరి దుష్టులై చరింతురో వారిని శిక్షించుటకే యని తెలియవలెను.

77. గోవులు సామాన్యముగా సాధుజంతువులగుటవలన పూజించి గౌరవించుచుందురు. అట్లుపూజనీయమైన గోవులైనను వాటిలో కొన్ని దొంగయావులై దుష్టులైనచో అట్టివానికి మెడకు గుదికొయ్యయు, కాళ్లకు బంధములును, మొదలైనశిక్షలు తప్పకసంభవించుచుండును. అట్లే ఆచార్యపరులైన సాధువులై నచోపూజింపబడుదురు. అనాచారపరులైనచో శిక్షింపబడుదురు.

78. పూర్వకాలపు ఋషులు, ఏమంత్రములను జపించి సిద్ధిపొందిరో ఆమంత్రములనే మన మిప్పుడు చాలకాలము జపముజేసియు, ఏల సిద్ధిపొందలేదనినచో వారు కేవలము భావ మును ఏకత్వముజేసి జపించిరి. మనము కేవలము వాచామాత్రమే చేయుచున్నాము. కాబట్టియే సిద్ధిపొందలేదని తెలియవలెను.

79. మనదేహముతో మన కెంత సంబంధమున్నదో ప్రపంచముతో కూడా అంతసంబంధ ముండవలయును. అట్లని కేవలప్రపంచసంబంధమే ప్రధానమని పెట్టుకొనినచో మన కున్నూ, మృగములకున్నూ భేదమేమి గలదు? మఱిమన ప్రపంచ పరమాత్మల రెండింటియందును మానవునికి సంబంధ ముండ వలయును.

80. బుద్ధభగవానులు అమనస్కముగాని సాంఖ్యతారకములుగాని ఎప్పుడును ఎవ్వరికిని బోధించలేదు. ఎప్పుడును కరుణయు, భూతదయయు, ప్రేమయు, సమరసత్వమును, శాంతమును, నిరాడంబరత్వములనే బోధించిరి. ఇట్టి సుగుణములు లేని వేదాంతము నిష్ఫలమని వారు గ్రహించి అట్లుజేసినారు.

81. ఎవ్వనిహృదయమునందు లవలేశమైనను దుఃఖముంటున్నదో అది అతని పూర్వజన్మపాపఫలంబని గ్రహించవలయును. ఎవ్వనిహృదయమందు మోక్షము జెందుటకై ఏమహాలక్షణములు కావలయునో అట్టి లక్షణము లన్నియు అచ్చుబోసినట్లు ఏజన్మములో సంపూర్ణముగా ఏర్పడునో వారాజన్మమునందే ముక్తిజెందుదురు.కొందరు మోక్షముబొందగోరి మహాతీవ్రముగా ధ్యాన మారంభించెదరు. అట్టివారికి వెంటనే శరీరమునకు ఉడుకుజేయుటో మరేదైనను జబ్బుచేసి యోగాటంకమగును. అదేమనగా, పూర్వజన్మపాపమేయని తలంచవలయును. కాన మోక్షముజెందుటకు ఆరోగ్యమైన దేహమును, అందుకు తగిన సుగుణములు కలుగవలయునంటే పూర్వజన్మపుణ్యఫలము తప్పక యుండవలయును. అట్లు పుణ్యము లేకపోయినచో ఈజన్మమున నైనను సంపాదించవలయును.

82 ఈ జన్మమున భాగ్యవంతులై యున్నవారు ఇదివఱకు జన్మములో పుణ్యముజేసినవారే యగుచున్నారు. ఇప్పుడు నానాదరిద్రములు, కష్టము లనుభవించువారు ముందుజన్మమున మహాపాపములు జేసినవారే యగుచున్నారు. ఏ కర్మ జేసినవారికి అదియే ప్రాప్తించును. ఎట్లనగా ఏ పైరు బెట్టుకొన్నవారికి యా ధాన్యమే వచ్చునుగదా! అందుచేతనే కొందరికి ధన ముండును. భూమి లేకుండును. కొందఱికి భూమియుండును, ధనము లేకుండును. కొందఱికి భూమియు, ధనమును రెండును యుండును. కొందఱు మహాధనవంతులయ్యును గృహము బాగుగ లేకుండును. కొందఱికి గృహము చక్కగాయున్నను, ధనకనకములు తక్కువగాయుండును. భాగ్యముండియు కొందఱు రోగులై యుందురు. బీదవారయ్యును కొంద రారోగ్యవంతులై యుందురు. కొందఱికి పశువులు బాగుగా వృద్ధియగును. కొందరికి గానేరవు. కొందరు ధనవంతులయ్యును కీర్తిపొందనేరరు. కొందఱు ధనము లేకనే కీర్తి పొందుదురు. కొందఱు కొద్దికాలములోనే గొప్ప విద్యావంతులయ్యెదరు. కొంద రెంతకాలముచదివినను విద్య రాదు. కొందఱు పసివారయ్యును, మహా భోగభాగ్యములుండియు మోక్షేచ్ఛ గల్గి విరక్తులగుచున్నారు. మఱికొందఱు ముసలివారయ్యును, మహాకష్టము లనుభవించుచున్నను విరక్తు లగుట లేదు. గాన ఈ వ్యత్యాసమంతయు పూర్వజన్మ పుణ్యపాపఫలములే యని తెలియవలెను.

83. ఒక గురుకులవాసమునం దున్నవారందఱును నిష్కల్మషమైనవారైయినచో కొలదికాలముననే వారు ముక్తులయ్యెదరు; అట్లుగాక కొందఱు దుష్టవృత్తులు గలవారుండి

నచో ఉభయులకును భ్రష్టత కలుగును. అదెట్లనిన, అన్నమును వండదలంచినప్పుడు అన్నియు ఎండుకట్టెలైనచో సులభముగాను, త్వరితముగాను, పాకమగునేకాని అట్లుగాక కొన్ని ఎండుకట్టెలును, కొన్ని పచ్చికట్టెలైనచో వండువారికి ప్రయాసమే గాక ఆలస్యముగూడా యగుచున్నది గదా!

84. ఏ ప్రకారము సూర్యోదయానికిముందు అరుణోదయమగునట్లు, హృదయపరిశుద్ధతగల్గి సిద్ధులు గలుగ బోవుటకు ముందు కొన్ని దృష్టాంతములు గల్గును. ఎట్లనగా జాగ్రదవస్థలోగాని, స్వప్నావస్థలోగాని, తనకు గల్గిన సంకల్పము లన్నియు సత్యములై ఫలించుచుండును.

85. భగవద్గీతయందు శ్రీకృష్ణ భగవానులు ఇట్లు చెప్పిరి. అర్జునా! వీరందరును నాచే హతులైయున్నారు. అయినను నీచే వీరిని జంపించి నీకు కీర్తియివ్వించదలచు చున్నానని చెప్పెను. అందువలన ఎవ్వరైనను కొన్ని ఘనకార్యములు చేసినను లేక చేయించినను, నేనే ఈ కార్యములను జేసినాననియు ఈ కార్యములు జరుగుటకు నాయొక్కశక్తియే కారణమనియు అహంకరించినచో వాడు తప్పక పతనము జెందును. గాన, నేను జేయుకార్యములన్నియు మాగురుదేవుని దయయేయని గాని, సర్వేశ్వరుడే నామీద దయయుంచి నాచే ఈ కార్యములను జేయించుచున్నాడనిగాని ఎఱిగి ఎవ్వడు నిమిత్తమాత్రుడై జేయునో వాడు ఉన్నతస్థితికి వచ్చును. పురోభివృద్ధిని పొందగోరువాడు పూర్వ వృత్తాంతమును మరువకూడదు.

86. ఏగింజయైనను పైన పొట్టు యున్నంతవఱకు మొలక వచ్చుచునే యుండును. ఎప్పుడు పొట్టు తీసివేసెదమో అప్పటి నుండి బీజము రానేరదు.

ఆప్రకారమే జీవునికి శరీరత్రయములనెడి పొట్టు ఎంతవఱకుండునో అంతవరకును జన్మము వచ్చుచునేయుండును. ఎప్పుడు శరీరత్రయములను విచారణద్వారా సంపూర్ణముగా తీసివేయుదుమో అప్పుడే జన్మరాహిత్యమగును.

87. యుద్ధములో విరోధులను జయించుటకైనచో అనేక ఆయుధములు కావలెను; గాని తన ప్రాణములు తీసుకొనుటకైనచో ఒక్క చిన్న కత్తియే చాలునుగదా! అట్లే అనేకసందేహములు గల్గి, తర్కవితర్కములు చేయువారికి అనంతవిచారము కావలెనుగాని సందేహములు లేనివారికి ఒక్క విచారణవాక్యమే చాలును.

88. ఆత్మానాత్మలను విభజించి తెలుసుకున్నంతమాత్రముననే మోక్షము వచ్చునెడల పూర్వకాలమహర్షులు వేల సంవత్సరములు ఎందుకు తపస్సుచేయవలయును? అందుచేత హృదయాంతర్గతమందున్న సర్వవాసనలును, వృత్తులును సంపూర్ణముగా తీసివేయక ముక్తి రానేరదని తెలుసుకొనవలయును.

89. ఒకయింటియందు నిలువుటద్దము యుండెను. ఆయింటి పసిబిడ్డ యొకడానిలువుటద్దముయొద్దకు వచ్చిఅద్దమునందగుపడుచున్న తనప్రతిబింబమునుజూచి మరియొక బాలునిగా దలంచి యా బాలునితో యాడుకొనుచు సంతోషించుచుండెను. అట్లే ఒక్క ఆత్మయే అనేక అంతఃకరణోపాధులయందు ప్రతి

ఫలించి అనేకముగా గానుపించుచుండగా అజ్ఞానులైనవారుఅనేక మందిగా వ్యవహరించి భయాశ్చర్యములు బొందుచున్నారు.

90. పూజాజపధ్యాన ప్రాణాయామాదులు చేయుటయు వేషభాషలను ధరించుటయు, పెద్దప్రయాసకరములు గానేరవు. ఈ కార్యములు చేయుటకు మెదడుతో ఎక్కువగాపనిలేదు. సామాన్యులుకూడా చేయవచ్చును. కష్టతరమైనకార్య మేది యనగా కనబడునట్టి జగత్తును లేనిదానినిగాను, కనబడని బ్రహ్మమును ఉన్నదానినిగాను జూచుటయందు మహాప్రజ్ఞ కావలసి వచ్చుచున్నది.

91. నీళ్లమీదనడచుటయు, ఆకాశమునందునడచుటయు, జలమధ్యమునందు, అగ్నిమధ్యమునందు యుండుట, మొదలైన అనేకమహత్తులను సంపాదించవచ్చునుగాని మనస్సుయొక్క వృత్తులను నిర్మూలింపజేసి నిర్వికల్పసమాధియందుండుట మహాకష్టమని శాస్త్రములును, ఋషిపుంగవులును జెప్పుచుండగా కొందరుసాధువులు ము క్తిసాధనముబహుసులభమనిచెప్పుచున్నారు. అట్టివారి వాక్యములను నమ్ముటకు ఎట్లు వీలగును? అయితే, మోక్షము మహాకష్టమైనదని ఎవ్వరునూ నిరుత్సాహము పొందకూడదు. అది చిరకాలాభ్యాసమువలన దొరకబడుచున్నది.

92. ఒకడు పెద్దగుంటలో పడియుండియు నాచేత పెద్ద లాంతరు వెలుగుచున్నదని చెప్పినచో ఎవ్వరునమ్ముదురు.లాంతరు చేతిలో వెలుగుచుండినచో గుంటలోపడుట ఏలకలుగును? అట్లే ఒకడు కేవల దుష్టవృత్తులు కలిగి పాపకార్యములుజేయుచు నేను జ్ఞానినని చెప్పుకొనుట కేవలము అవమానకరమగుచున్నది.

93. బ్రతికియున్నప్పుడు హృదయము ఏయేకోర్కెలతో యుండునో అంత్యకాలమునందుకూడా అట్లే యుండును. అందు చేత వానికి అందుకు తగిన జన్మమే వచ్చుచున్నది. బ్రతికియుండి నప్పుడు మంచిపుణ్యకార్యములు చేసియుండినచో వానికి మరణ కాలమునందు ధైర్యము గలుగుచున్నది. పాపకార్యములు జేసి యున్నచో వానికి అధైర్యము భయము, దుఃఖములు గలుగు చున్నవి.

94. బంగారును కొనువారు ఒఱపువేయుటచేతను, నఱు కుటచేతను, సుత్తెతో కొట్టుటచేతను, తుదకు కరగించుటచేతను ఇట్లు నాలుగురకములుగా పరీక్షించి కొనుచున్నారు. అట్లే అభ్యాసకుడు తనహృదయమును నాలుగువిధములుగా పరీక్షించి తెలుసుకొనవలయును. ఎట్లనగా ప్రవర్తనచేతను, భోజనాదుల చేతను, వాక్కుచేతను, సంకల్పములచేతను తెలుసుకొనవల యును.

95. ఒకరాతిగుండును కొండమీదికి ఎక్కించుట ఎంత కష్టమో మనస్సును అమనస్కస్థితికి తీసుకొనిపోవుటయు అంత కష్టమని తెలియవలెను. రాతిగుండును ఒకవేళ మహాకష్టపడి కొండశిఖరభాగమునకు దీసికొనిపోయినను, కొంచెముదూర ముండగా విడిచినను దొర్లి క్రిందికివచ్చి చేరును అట్లే ఒక పెద్దయోడమీద కూర్చుండి విదేశమునకు ప్రయాణముచేయుచు ఆవలిగట్టు ఘర్లాంగుయుండగా ఓడ పగిలిపోయినను అందరును మునిగిపోవుదురుకదా; గాన మనస్సుయెడ బహుజాగ్రత్తగలిగి యుండవలయును.

96. ఒక్కసిమెంటుదిమ్మ పోతపోసి ఎండబెట్టి ఆమీాద నీటిలో పడవేసినచో అది నానాటికి మహాగట్టిదేలుచుండును. అట్లుగాక పచ్చిదైనచో నీటిలో కరగిపోవును. మఱియు మట్టితో జేసినకుండయు కాల్చకనే పచ్చిది నీళ్ళలో బెట్టినచో నీళ్లలో కరగిపోవును. కాల్చినకుండయైనచో చెడిపోక నిలిచియుండును. ఆలాగుననే బోధకులైనవారు జ్ఞానాగ్నిచే కాలినవారైనచో బాగుపడెదరు. లేకున్న వీరుకూడా లోకములో కలసిపోయెదరు.

97. ప్రపంచములో అన్నిఖండములకన్నను భరత ఖండము పవిత్రమైనదని చెప్పబడుచున్నది. ఎందువల్లననగా తక్కిన దేశములన్నియు భోగదేశములనియు, భరతఖండ మొక్కటియే యోగదేశమనియు ప్రఖ్యాతి. ఇదియునుగాక తక్కిన దేశములలో మాంసాహారులు అధికులనియు, భరతఖండ మున మాంసాహారులు స్వల్పమనియు శాకాహారు లధికులనియు అందువలన భరతఖండము పవిత్రమైనదని చెప్పబడెను.

98. వివేకానందుడు అమెరికాకు పోయినప్పుడు అచ్చటి గొప్ప తెలివిగల్గినవారు ఇట్లు ప్రశ్నించిరి. మీా దేశస్థులకును మా దేశస్థులకును ఏమిభేదమని యడిగిరి. అందుకు వివేకానందు డిట్లనెను. పోవుటకు శక్యముగానటువంటి హిమవద్గిరిశిఖరముపై రత్నములగని యున్నదని తెలిసినచో అది ఎంతకష్టప్రయాస మైనను లెక్కచేయక ఆ శిఖరముమీాదికి పోదురు మీా దేశస్థులు. అట్టి మేరుశిఖరముపై ఒక్క మహాఋషిపుంగవు డున్నాడని తెలిసినచో ఎంతప్రయాసకైనను ఓర్చి పోజూతురు మా వారు. ఇదియే మీాకు మాకు గల వ్యత్యాసమని ఒక్క వాక్యముతో జవాబు చెప్పిరి.

99. గీతను చదువు ప్రతివారున్నూ గీతావాక్యములు సాక్షాత్తుగా శ్రీకృష్ణభగవానులముఖుమునుండియే వచ్చుచున్న వని భావింపుచు తాను నిజముగా అర్జనుడేననియు భావించవల యును. గీతాశ్లోకములు ఏడువందలవక్కటికి ఎన్ని అక్షరములుం డునో అన్నిలక్షలమారులు గీతను చదివినచో అప్పుడు మీకు గీత యొక్క సంపూర్ణసారభూతార్ధము తెలియగలదు. అట్లు చదువు టకు ఎన్నిజన్మలకు పూర్తియౌనో అప్పటివఱకు మీరుగీతను చదవండి. అప్పుడు మీకు గీతాసిద్ధి తప్పక కలుగును.

100. సాధకునికి అపరిగ్రహ మెందుకువిధించెననగా సాధ కుడైనవాడొకడు తనసాధనను వీడి ఏదోఒక సత్కార్యమారం భించి ధనవంతుల నాశ్రయించి అతడు భక్తితో ఇచ్చినదానిచే తృప్తిజెందక అతనిని లోభియనియు, త్యాగికాదనియు, తానను కొన్నంత ఇవ్వలేదనియు వానిని నిందించుచున్నాడు. నిరాశ పరుడుగా యుండవలసిన తనకు ఆశగల్గుటయు, దాతలు ఇచ్చిన ధనముచే తృప్తిలేకపోవుటయు ఇన్నిదోషములు తనయందుంచు కొని యాదోషములు ఇతరులపైకే వేయుట మహాపాపమగును. అందువలన అపరిగ్రహము విధింపబడెను.

101. మఱ్ఱిగింజలోనుండి మొక్క బయలుదేరునప్పుడు ముందు రెండాకులతో చిన్నదిగా బయలుదేరును. అది క్రమ క్రమముగా మహావృక్షమై అనేకజీవులకు ఆశ్రయమై ఫలము లను, నీడను యిచ్చుచు, సంరక్షించుచున్నది. అట్లే విద్యలోగాని భక్తిలోగాని ఉపన్యాసములు చేయుటలోగాని మెల్లమెల్లగా వృద్ధియై కొంతకాలమునకు గొప్ప స్థితికి రాగలుగుదురు.

102. జాగ్రదవస్థలో నీ హృదయము పరిశుభ్రమైనదియు లేనిదియు తెలియవలెనంటే స్వప్నావస్థలో స్పష్టముగా తెలియవచ్చును. ఎట్లనగా స్వప్నావస్థ ఎప్పుడు పరిశుద్ధమగునో అవస్థలన్నియు పవిత్రమైనట్లేయని తెలియవలెను. స్వప్నావస్థలో ఏదైన లోపము లుండినచో జాగ్రదవస్థకు వచ్చిన తక్షణమే పశ్చాత్తాపముజెంది ప్రాయశ్చిత్తము జేసుకొనవలెను.

103. ప్రపంచములో జార, చోర, హింసాది క్రూర కార్యములు జేయునట్టి దుష్టాత్ములను శిక్షించుటకే పోలీసు వారు ఏర్పడిరి. అందువల్లనే వారికి ఎఱ్ఱని టోపీలును ఎర్రని డ్రస్సులును ఉండుటకు కారణమైయున్నది. అట్లే సూక్ష్మ దేహమునందునుకూడా కామ క్రోధాదిచోరులు జ్ఞానధనమును దొంగలించుటకు సమయము జూచుచున్నారు. అట్టి అంతరంగ చోరులను పట్టుకొని శిక్షించుటకే సాధువులందరును ఎర్రని రంగు గుడ్డలను ధరించుటకు కారణమని తెలియవలెను.

104. దక్షిణదేశమంతయు గుళ్లుగోపురములు మహత్తరముగా కట్టించినారు. ఉత్తరదేశమందు గుళ్లు గోపురములు కొద్దిగా కట్టించి మఠములను, ఎక్కువగానిర్మించిసాధుపోషణాల విద్యాపోషణలను విశేషముగా గావించుచున్నారు. అనేకగుళ్లు గోపురములు కట్టించుటకంటె బాగుగా నిష్ఠజేసుకొనెడి ఒక్క సాధువును పోషించడమో లేక గొప్ప విద్యాపాఠశాలల నిర్మించడమో మేలు.అయితే గుళ్లు గోపురములు లేకుండచేయమని అర్థముకాదు. కొద్దిగా యుండిన చాలును.

105. మూగవానికికూడ భోజనముయొక్క రుచులున్నూ, తృప్తియు సంపూర్ణముగా దెలియును. కాని, వానినిగురించి విమర్శించి ఇతరులకుమాత్రము చెప్పజాలడు. అట్లే పెద్దల చేత ఆత్మస్వరూపసాక్షాత్కారముపొంది తృప్తిజెందవచ్చును. కాని, ఇతరులకు బోధించవలయునన్న విద్యలేనివాడు మూగ వాడగుచున్నాడు. లోకోద్ధరణ జేయవలయునన్న విద్య తప్పక యుండవలయును.

106. ఎవడు సర్వవిజ్ఞానస్వరూపుడై బ్రదికియుండియు శవమురీతిగా సర్వవ్యవహారరహితు డగుచున్నాడో వాడు సంపూర్ణమగు కైవల్యమును పొందినవాడగుచున్నాడు. ఇట్లుం డగా కొందరు అనేక వికారములుపొందుచు, ఇంద్రియములు వాటివాటి కార్యములు జేయుచున్నవిగాని ఆత్మస్వరూపుడనైన నాకేమి సంబంధములేదని జెప్పుదురు. ఆత్మయందు సంకల్పము లేకున్న కార్యము గల్గుటకే వీలులేదు. అందువలన వారివారి హృదయములు వారువారే చూచుకొని బాగుచేసుకొనవలెను.

107. ఒక స్త్రీకి వివాహము గాకమునుపు ఏకీర్త్యపకీర్తు లుండునో అవి పుట్టినింటివారికేవచ్చుచున్నవి. వివాహమైనప్పటి నుండియు ఆమెయొక్క కీర్త్యపకీర్తులు భర్తవంశమువారికేవచ్చు చున్నవి. అట్లే గురువువద్ద జేరనివాని కీర్త్యపకీర్తులు వానికిన్నీ వాని బంధువులకున్నూ పోవుచుండును. ఉపదేశమైనవెనుక వాని కీర్త్యపకీర్తులు గురువుగారికి వచ్చుచుండును. కనుక శిష్యులైనట్టివారు గురువునకు కీర్తి తేవలెనుగాని అపకీర్తి తేరాదు.

108. యుగమునుబట్టి మానవునిమనస్సు మారుచుండునా లేక మనస్సునుబట్టి యుగములు మారుచుండునా అని సందేహ

మొక్కటి యుండును. ఇందుకు జవాబేమనగా మనస్సును బట్టియే కాలము మారుచుండునని చెప్పబడును. అట్లుగాక యుగమే కారణమని చెప్పినచో పుణ్యావంతమని చెప్పబడు కృత యుగమునందు హిరణ్యాక్ష, హిరణ్యకశిపాది మహాదుర్మార్గు లుండినట్లు వినుచున్నాము. కలియుగము పాపస్వరూపమైనచో బుద్ధ, శంకర, రామానుజ, మధ్వాది మహా పుణ్యపురుషు లుండినట్లు వినుచున్నాము. కృతయుగము పుణ్యావంతమైనచో ఆయుగమువా రందరును పుణ్యాత్ములేయై యుండవలెను. కలియుగము పాపరూపమైనచో ఆ కాలమువారందరును పాపు లయ్యే యుండవలెను. అట్లుగాక, మిశ్రమమైయుండుటనుబట్టి యుగములవలన మనకు మేలు కీడులు లేవనియు వారివారి జ్ఞానాజ్ఞానములును ప్రజ్ఞాప్రజ్ఞలే ముఖ్యకారణములని తేలు చున్నది. ఇదియునుగాక నవగ్రహములును పంచభూతములును మృగపశుపక్ష్యాదులును ఋతువులును వృక్షఫలాదులన్నియు కృతయుగమునం దెట్లున్నవని శాస్త్రములు చెప్పుచున్నవో కలి యుగములోకూడా ఏలాటిమార్పు లేకుండా అట్లే యుంటున్నవి. ఇట్లుండగా గొప్ప తెలివిగలిగిన మానవజాతికి కలిపురుషుడెందుకు బట్టెనో తల్లక్రిందులుజేసెనో తెలియకున్నది. కాన అట్లు చెప్ప కూడదు.

109. ఒక ప్రభువు తన ముఖ్యమంత్రినిజూచి నీకు నా యందు ఎంత ప్రేమ కలదు అని యడిగెను. ఆవాక్యమును మంత్రి విని చక్కగా యోచించి ఇట్లనెను. ఓ ప్రభువా! నీయందు నాకు కుక్కకున్నంత విశ్వాసమున్నదని చెప్పెను. ఆ వాక్యమును ప్రభువు విని మహాకోపముజెంది నీవు అహంకారివని తోచు

చున్నది. లేకున్న ఇంతనీచమైన ఉపమానము జెప్పి, నన్నవ మానము జేసితివని కన్నులెఱ్ఱజేసెను. ఆమాటకు మంత్రి ఇట్లనెను. ఓ రాజా ఈ విషయము పరీక్షజేసి చూడుమని చెప్పి రాజుగారి పెంపుడుకుక్కను సభకు దెప్పించి యా కుక్కను తోకయు చెవులును తెగగొట్టించి కఱ్ఱతోకొట్టి బయటికి తఱిమివేసిరి. మరల యాకుక్కను పిలువగానే యాకుక్క ప్రభువుయొద్దకు వచ్చెను. మఱల యా కుక్కనుపట్టుకొని ఒక కాలు తెగగొట్టించి, దెబ్బలుకొట్టి బయటకు వెళ్లగొట్టిరి. వెంటనే యా కుక్కను భాషతో పిలువగానే కుంటుకొనుచు నెత్తురు గార్చుకొనుచు తన ప్రభువువద్దకు వచ్చి మహాభక్తితో నిలచెను. ప్రభువు యా కుక్కయొక్క విశ్వాసమునుజూచి మహాశ్చర్యము నంది మంత్రియొక్క హృదయమునకు మెచ్చుకొని బహుమానము లొసగెను.

110. పంచభూతములైదును ఒక్క తత్వములో నుండి వచ్చినను, ఒకదానికొకటి విరుద్ధములైయున్నవి. ఎట్లనగా, భూమి జలముచేత కరిగిపోవుచున్నది. అగ్ని జలముచేత నార్పబడుచున్నది. మఱియు, ఆయాభూతమునం దాయా భూతము కలిసినప్పుడు అభివృద్ధి యగుచున్నవి. ఎట్లనగా, గాలికి మఱికొంతగాలి సహాయమైనచో పెద్ద ఝంఝూమారుత మగుచున్నది. అగ్నిలో మఱికొంత అగ్నికలసినచో విశేషయగ్ని యగుచున్నది. జలమునకు మఱికొంత జలము గలసినచో పెద్ద ప్రవాహమగుచున్నది. అట్లే త్రిగుణములుకూడ సత్వమునకు రజమును, రజమునకు తమమును, రజస్తమములకు సత్వమునూ విరోధమగుచున్నవి. అట్లుగాక, సత్వమునకు మఱియొక సత్వము

కలసినచో గొప్ప సత్వమగుచున్నది. రజమునకు మఱియొక రజము సహాయమైనచో విశేషమగుచున్నది. తమమునకు వేరొకతమము సహాయమైనచో మఱింత వృద్ధియగుచున్నది. అందువల్ల నేగృహస్థాశ్రమములో భార్యాభర్తలును, అన్నదమ్ము లును, బావమరదులును, తండ్రికుమారులును, సత్వగుణస్థులై నచో ప్రేమస్వరూపులగుచుందురు. రజస్తమస్థులైనచో, విరోధు లగుటకు కారణమగుచున్నది.

111. చచ్చిపోయినపిదప నేను నరకమునకు పోదునా? స్వర్గమునకు పోదునా? లేక మోక్షమునకు పోదునా అని ఒకరిని అడుగవలసిన అవసరము లేదు. దానికి తపస్సు చేయవలసిన పనికూడా వలదు. ఇప్పుడు మన హృదయములోయున్న గుణము లనుబట్టీ అందఱును చక్కగా తెలుసుకొనవచ్చును. ఎట్లనగా, సత్వగుణము యుండగా చనిపోయినచో స్వర్గలోకమునకు పోవును. రజోగుణము యున్నప్పుడు చనిపోయినచో మనుష్య జన్మమును పొందును. తమోగుణము యున్నప్పుడు చనిపోయి నచో నరకమునకు పోవును. లేక పైజెప్పిన త్రిగుణములను జ్ఞానయోగముచే రహితముజేసుకొనినచో మోక్షమునకు పోవు దురని తెలియవలెను.

112. కొందఱు మా సుందరమునకు సుకుమారమునకు, సౌఖ్యములకు, భంగముకలుగకుండా మోక్షమురావలె నను కొనుచుందురు. అట్లెన్నటికిని రానేరదు. ఎట్లనగా, పెఱుగు చెడకుండా మథించకుండా వెన్న ఎట్లు రానేరదో, చెఱుకు నలుగ కుండా పిప్పిగాకుండా బెల్లము ఎట్లురానేరదో అట్లే, ఈ దేహ

మును యోగములచేతను, వ్రత జప యుపవాసంబులచేతను, కృపింపజేయకయే పదివేలజన్మములకైనను మోక్షమురానేరదు.

113. గాంధీమహాత్ముడు లండనుకు పోయినపుడు చక్రవర్తి స్వయముగా లేచి మహాత్ముని చేయిబట్టుకొని తనతో సమానముగా సింహాసనము మీాద కూర్చుండబెట్టుకొనెను. అది చూచి యాదేశపుపండితు డొక్కడు మహాత్మునివంటి గౌరవము నాకుకూడా కావలెనని యున్నదిగాని వారిమాదిరిగా నేను ఆచరణయందు నిలువగలనో లేనోయని సందేహము గలుగుచున్నదని అన్నాడట. అట్లే మనలోకూడా చాలామందికి మేము గొప్పవారము కావలెననియు పూజింపబడవలెనని యున్నదిగాని అయితే మహానుభావులు ఆచరించిన నియమ మములు మనము ఆచరించగలమా లేమా యని సందేహము గలుగుచుండును.

114. భూమియొక్క అణువులలోనుంచి క్రిమికీటక పశుపక్ష్యాది జన్మములు క్రమక్రమముగా మారి తుదకు మానవజన్మము వచ్చినదని పాశ్చాత్యులు చెప్పిరి. అట్లయినచో మనము తలచించవలెనంటే మనకు గమ్యస్థానము మన్నేనని చెప్పవలసియున్నది. అందువలన మనము తుదకు మట్టిలో లయము కావలెనని సిద్ధాంతమగుచున్నది. మనయొక్క వేదమతము ఏమి చెప్పుచున్నదనగా మానవునికి గమ్యస్థానము పరమాత్మయే యనియు అట్టి పరబ్రహ్మమునుండి జీవత్వము ఏర్పడినదనియు మరల క్రమక్రమంబుగా పరమాత్మలోనే చేరవలెననియు చెప్పిరి. కాన మన మతమునకును ఇతర మత ములకును ఎంత తారతమ్యమున్నదో గమనించుడు.

115. బ్రహ్మోపదేశము జేసుకొనదలచిన వారెల్లరు కూడా మత్తువస్తువులను మాంసాహారమును వాడకూడదు. అట్టి మత్తుపదార్థములకు అలవాటు పడినవారికి క్రింది సాధనములచే వాటిని విసర్జించవలయును.

కల్లు అలవాటుగలవారు తెల్ల ఉమ్మెత్తాకులరసము కల్లులో కలిపి త్రాగినచో ఆ యలవాటు పోవును.

గంజాయి త్రాగువారు తుమ్మియాకును గంజాయివలె నలిపి చిలుములో వేసి పీల్చినచో ఆ యలవాటు పోవును.

నశ్యము అలవాటుపడినవారు సొంటిపొడి పీల్చినచో ఆ అలవాటు పోవును.

మత్స్యమాంసములను తినువారు కుళ్లిపురుగులు బట్టినవి నమలినచో ఆ యలవాటు పోవును. ఈ మత్తుపదార్థముల ద్వారా గలుగు యానందమునకు సాలంబానందమని పేరు. దీనిని మఱిగినవారు నిరాలంబసుఖమునకు దూరులగుదురని ప్రతిముముక్షువు ముఖ్యముగా గమనించవలెను.

116. జ్యోతిశ్చక్రమునందు ఇరువదేడు నక్షత్రము లుండును. అందు తొమ్మిది నక్షత్రములు దేవతాంశములనియు, తొమ్మిది నక్షత్రములు మానవాంశములనియు తొమ్మిది నక్షత్రములు రాక్షసాంశములనియు చెప్పబడుచున్నవి. వీనిలో దైవనక్షత్రములయందు పుట్టినవారు మంచి పుణ్యకార్యములు తాము చేయుటయందును ఇతరులచే చేయించుటవల్లను మహానందము పొందుచుందురు. మానవ గ్రహములలో పుట్టినవారు పుణ్యకార్యము చేయుటయందు అపేక్షయును విరోధమును రెండును లేక యూరకుందురు.

రాక్షస గృహములయందు పుట్టినవారు పుణ్యకార్యము లెచ్చటనైనను జేయుచున్నచో వానిని విఘ్నముచేయుటయే వారికి పనిగాపుండును. కావున పరమేశ్వరుని ధ్యానము జేసినచో రాక్షసజన్మము తొలిగిపోయి దైవజన్మము వచ్చును.

## శ్రీ స్వాములవారి జీవితవాక్యములు

117. నేను బాల్యమున బడిలో చదువుకొనునప్పుడు అహోరాత్రములు చదువుటగాక బడికిబోవుమార్గములోకూడా చదువుచునే పోవుచుండెడివాడను. నేను చదువవలసిన పాఠమే గాక యా గ్రంథమంతయును కంఠస్థము జేసుకొనియుంచు వాడను. ఇప్పుడు మనశిష్యులలో ఉత్తముడని చెప్పబడువాడు తనజీవిత మంతయుచేయుధ్యాననిష్ఠలన్నియు నేనొక్కనాడు ఒక్క ఘంటకాలములో జేసినంత తపస్సు జేయజాలరని చెప్పుచున్నాను. కాబట్టి మీరు చేయు స్వల్పనిష్ఠలకే మీరు గర్వించవద్దు.

118. ఇప్పుడు ఈ చాతుర్మాస్యములలో రాజభోజనములు దొరుకుటయు, వస్త్రములును, దక్షిణలును, నమస్కారపూజాగౌరవములు ఇవన్నియు జరుగుటయు మనయొక్క తపస్సువల్లనని సాధువు లెవ్వరును గర్వించకూడదు. ఏలనన ఇదంతయు మన పూర్వులైన మహర్షులయొక్క తపోమహిమయే గాని ఇతర మేమియుకాదు. గాన సాధువులైనవారు వారివారి గౌరవము పోగొట్టుకొనక మన తదనంతరము వచ్చు సాధుపరంపరలకు గౌరవ ముండేలాగున వర్తించవలెను. అట్లు గాక స్వేచ్ఛాపరులై అనాచారులైనచో ఈ ప్రపంచములో మనకు

భిక్షనిచ్చువారుండరుగదా! తుదకు మంచినీరైనను ఇచ్చువా రుండబోరని బాగుగా తెలియవలెను.

119. పరమాత్మ నాచేత ఏమేమికార్యములు చేయించుటకై పుట్టించినాడో ఆయా కార్యములన్నియు నాచే చేయించినాడు. ఇకను నేను ఏ గ్రంథములను వ్రాయదలంచలేదు. ఆఖరున నిర్వాణనిలయమను గ్రంథముతో సంపూర్ణమైనది.

120. భగవద్గీతయందు కొన్ని శ్లోకములు నా నాస్తికత్వమునకు అర్థమిచ్చుచుండును. తెలియనట్టివారు కొందరు నా నాస్తికత్వమునే సిద్ధాంతముచేయుచుందురు. గీతయందు ఆ నాస్తికత్వమే బోధించుచున్నది గాని నా నాస్తికత్వము ఎచ్చటను చెప్పబడలేదు. గాన చక్కగా తెలిసినవారిచేతనే శ్రవణముచేయవలయును.

121. లోకములో మలయాళస్వాములవారు సాక్షాత్తు అవతారపురుషుడు. కేవలం వ్యాసావతారమని అనేకులనేకరీతుల ననుకొనుచుందురు. అదియంతయు నేనొప్పుకొనను. నేనున్నూ మీవలెనే పుట్టినాను మీవలెనే పెరిగినాను. అయితే బాల్యమున బాగుగా చదివినాను. పసితనమునందే వైరాగ్యముగల్గి సంసారమునుండి విడుదలయైతిని. ఇంతటి అభివృద్ధికి కారణమేమనగా నేను కష్టపడిచేసిన శాస్త్రాభ్యాసముచేతను తపోధ్యానాదులచేతను నేను వృద్ధికి వచ్చినానని తెలియవలెను. మీరందఱుకూడా అదేప్రకారముగా దీక్షకంకణులై తపస్సు చేసినచో మీరందరును మహాత్ములయ్యెదరని నమ్మవలెను.

122. ఇప్పుడు వ్యాసాశ్రమమునకు అనేకమంది భక్తసంఘమున్నారు. ఇంతవరకు ఒక్కరైనను నాకు శిష్యులని నేననుకొనలేదు. ఏలననగా వారలందరిని మన సోదరులనియే

తలంచుచున్నాను. ఎందువల్లననగా శిష్యులని తలంచినచో నేను గురువుననెడి అహము గలుగునేమో యని తలంచుచున్నాను.

123. ఒక్కనాడొక భక్తుడు నావద్దకువచ్చి ఇట్లుప్రశ్నించెను. మీకు భగవంతుడగుపడినాడా యనెను అందుకు నేనిట్లు చెప్పితిని. నాకు భగవంతుడు ఇప్పుడే అగుపడవలెనని చింత లేదు. మరేమనగా భగవంతుడు జెప్పిన ధర్మప్రకారము సర్వావస్థలయందును నడువలేకపోవుచున్నానే యని చింతయే నాకు కలదని జవాబు చెప్పితిని.

124. కొందరు సాధకులు యోగాభ్యాసాదులచేత తల వేడియు కన్నులుమంటలు కలిగినవని నూనెలతో తలలంటుకొనుచుందురు. నేను ఇంటివద్దనున్నప్పుడు పదిసంవత్సరముల వయస్సులో శిరస్సునకు చమురుపెట్టుకొంటినేమోగాని మరల ఇప్పటివరకు నాతలకు చమురుపెట్టుకొని ఎరుగను; అయినను నాకు శిరస్సుగాని నేత్రములుగాని వేడిచేయుటయే లేదు.

125. సాంఖ్యయోగమును విచారణచేయువారు కొందరు ఇరువదినాలుగు తత్వములనగా ఇవి. వీటివిషయములివి. ఆయా ఇంద్రియములకు ఆయా విషయములు స్వభావములు. వాని యన్నింటికిని నేను సాక్షినని తెలుసుకొనుటయే చాలునని చెప్పుచుందురు. గాని ఈ తత్వములయందులీనమై త్రిగుణములుగలవని ఎఱిగి వాటిని రహితముచేయుటకు ప్రయత్నము చేయుట లేదు. ఇచ్చటనే వారు పొరపాటుబడుచున్నారని తెలుసుకొనవలయును. పంచీకరణము సర్వము కంఠస్థము చేయవలయునంటే కొన్నిదినములలో చేసుకొనవచ్చును. గాని, నేతి నేతిమహావాక్యములలో చెప్ప

బడిన ఆత్మతత్త్వమును తెలుసుకొనవలయునంటే ఎంతకాలము తపస్సుచేయవలయునో తెలుసుకొనవలయును. సాంఖ్యయోగ కర్తయగు కపిలమహర్షి అట్టి ఆత్మతత్త్వమును తెలుసుకొనుటకై పాతాళలోకమునందు తపస్సుచేసినట్లు సగరచక్రవర్తి వృత్తాంతమువలన తేటతెల్లముగా దెలియుచున్నప్పటికిని కొందఱు గురువులు తపస్సు అవసరములేదని చెప్పువారు ఎంత ప్రజ్ఞావంతులో తెలిసికొనవలసియున్నది.

126. రైలుఇంజను మొట్టమొదట కేవలజడముగా యుండును. అట్టిజడమైన ఇంజనుకు షుమారు మూడుగంటల కాలము నిప్పును, నీరును వేసి రగుల్కొల్పినచో అది స్టీముగా మారి అనగా చైతన్యముగల్గి కేవల జడములైన అనేకపెట్టెలను లాగుకొని అతివేగముగా పోగలుగుచున్నది. అట్లే మొట్టమొదట జ్ఞానహీనుడైన మానవుడు తన మనోఇంద్రియములను ఏకాగ్రము చేయుటకై నిర్జనప్రదేశమందుజేరి షుమారు మూడు సంవత్సరములైనను నిష్ఠాగరిష్ఠుడై తీవ్రమైన తపస్సు జేసినచో స్టీముగలిగిన ఇంజనువలె గొప్ప చైతన్యముగల్గి తాను తరించుటయేగాక అనేకులను తరింపజేయునని తెలియవలెను.

127. సృష్టిలో ఒక రహస్యముగలదు. ఎట్లన కారణం వినా కార్యమెచ్చట నుండబోదు. ఒక వృక్షమునుండి వచ్చిన, ఫలపుష్పాదులనుజూచి ఇట్టి వైపరీత్యమంతయు యీ వృక్షము యొక్క బీజమునందే నిగూఢమైయున్నదని, ఎట్లు గ్రహించుదుమో, అట్లే మానవుడైనవాడు, పూర్వజన్మమునందు ఏకర్మలు చేయునో యీ కర్మఫలము తప్పక అనుభవింపవలయును. తననీడను తాను నెట్టివేయజాలనట్లు తనకర్మనుగూడా తాను

దాటజాలడు. ముష్టివిత్తనము బెట్టి, మధురఫలమునుగోరువాడు ఎట్టి మూఢుడో దుష్కర్మలు జేసి సుఖమును గోరువాడుకూడా అట్టి మూఢుడేయని తెలియవలెను.

128. స్వామి వివేకానందుని ఒక వృద్ధుడు ఇట్లు ప్రశ్నించెను—నాకు ముగ్గురుభార్యలుండియు నన్ను ఇంకా విషయాపేక్ష బాధించుచున్నదే మీరుమంచి యౌవనవంతులరయ్యును బ్రహ్మచర్యమును ఎట్లు పాలించుచున్నారని ప్రశ్నించెను. అందుకు వివేకానందులిట్లనిరి. రైలుపోవుచుండగా పెట్టెలుబట్టుకొని ఎంత మంది నిలుపజూచినను ఎట్లునిలువజాలదో ఇంజనుయొక్క రహస్యముదెలిసిన డ్రైవరు ఒక్కసారి బ్రేకునొక్కినచో యీ బండి యంతయు నాగిపోవునుగదా అట్లే ఆత్మస్వరూపమును పొందిన వారికి సర్వేంద్రియనిగ్రహము స్వయముగానేగల్గును. ఆత్మ స్వరూపమును పొందనివారు ఇంద్రియములను నిగ్రహము చేయుట కష్టసాధ్యము.

129. స్వప్రయత్నము లేకుండావచ్చిన సుఖదుఃఖములు ప్రారబ్ధ మనబడునుగాని కర్తృత్వముతోగూడి చేసిన కర్మములు, ప్రారబ్ధమనుటతప్పు. అధికముగా భుజించి జబ్బు వచ్చినచో ప్రారబ్ధ మనుటమంచిదిగాదు.

130. మునియనగా మౌనముగా యుండువాడని అర్థము గాదు. మననముచేయువాడే ముని యని చెప్పబడును.

131. వృద్ధిబొందదగు జీవునికి తనలోయుండు తప్పులన్నియు తనకు ప్రత్యక్షముగా గానుపించుచుండును. క్షీణదశకు పోవుజీవులకు ఎదుటివారి తప్పు లగుపడుచుండునుగాని, తనలోని తప్పు ఒక్కటైనను గానుపించనేరదు.

132. సర్పవిషమువలన చేదువస్తువులు తియ్యగా గనుపించును. జ్వరముచేత తియ్యనివస్తువు చేదుగా గాన్పించును. అట్లే తమోగుణస్థులకు అశాస్త్రీయమంతయు శాస్త్రీయముగా గనుపించును.

133. ప్రతిమనుజుడును ఎవ్వరికైనను ఒకవస్తువు ఇచ్చినను ఇతరులచేత తీసుకొన్నను ఎడమచేతితో ఇచ్చుటయు పుచ్చుకొనుటయు తగదు. ఏలననగా అట్లుచేయుట నిర్లక్ష్యమును అగౌరవమును సూచించుచుండును. అందువలన ఎదుటివారిని గౌరవించుచు పూజ్యభావమును చూపవలెనుగాని నిర్లక్ష్యము చేయదగదు. ఇదియు వంశాచారమును బట్టి వచ్చుచుండును.

134. నాకు పంచదారయంటే బహు ప్రేమగా యుండును; గాని తీపుయంటే నాకు ఇష్టము లేదు. అన్నట్లు కొందఱు శిష్యులు మాకు గురువుయంటే సాక్షాత్తు పరమాత్మభావము యుండును గాని; వారు చెప్పు పనులుమాత్రము మాకు కష్టము గలుగుచుండును. అంతేకాని మఱేమియు లేదు అని చెప్పుచుందురు.

135. ప్రపంచములో ప్రతిసాధువునకును తాము జగద్గురువులము కావలెననియేయందురు. అట్లుకావలెనంటేఎప్పుడువారి దేహేంద్రియాదులకు, వారువారు సర్వాధికారులగుచున్నారో అప్పుడు వారు జగద్గురువులగుటకు ఏలాటి సంశయము లేదు.

136. ఒకమానవుడు దుష్టత్వమునుండి విడివడి సత్సంగుడై తఱించి పూర్ణుడైనవాడు, మరలాదుష్టకార్యమునుచేయజాలడు. ఎట్లనగా కుమ్మరిసారెను గట్టిగాత్రిప్పి కుండనుచేసి దించివేసినను యాచక్రము ఏవైపునకు తిరుగుచుండెనో యావైపునకేతిరుగుచుండునుగానిఎప్పుడును ఎదరుతిరిగినడువనేరదుగదా!

blank page

# శ్రీ యోగవాసిష్ఠము.

పూర్వార్ధం 2 బైండ్లు రు. 20-0-0 లు.

ఉత్తరార్ధం 2 బైండ్లు రు. 25-0-0లు. పూర్తిగ్రంథం రు. ~~[illegible]~~ 45

# అనుభూతిప్రకాశము

వెల : రు. 6-0-0.

# యథార్థభారతి

సంవత్సరము చందా : రు. 3-0-0.

## శ్రీసద్గురు స్వాములవారిచే రచింపబడిన కొన్ని గ్రంథములు

| | | | |
|---|---|---|---|
| 1. శుష్క వేదాన్తతమో భాస్కరము | రు. 2-8-0 | 12. గురుభక్తిప్రభావము | 1-4-0 |
| 1. స్వబోధసుధాకరము | 1-8-0 | 13. మహామంత్రాతీతప్రభావము | అ12 |
| 3. ఓంకారముప్రణవోపాసన | 1-4-0 | 14. శ్రీనిర్వాణనిలయము | [illegible]-0 |
| 4. ప్రశ్నోత్తరమాణిక్యమాల | 2-0-0 | 15. బ్రహ్మవిద్య | 0-12-0 |
| 5. శ్రీధర్మసేతువు | 4-0-0 | 16. సన్యాసయోగము | 1-2-0 |
| 6. గీతాశయము | 0-10-0 | 17. మాయనుమాయం చేయుట | 0-12-0 |
| 7. శ్రీమద్భగవద్గీత | 6-0-0 | 18. ఓంకారసత్రయోగము | [illegible]-0 |
| 8. శ్రీబాలయోగిని | 4-8-0 | 19. పూజాపంచరత్నమాల | 0-12-0 |
| 9. లోకోద్ధారకము | 4-0-0 | 20. ఉపదేశామృతం ( 1 భా ) | 0-4-0 |
| 10. ఈశ్వరకృప | 6-0-0 | 21. ,, (2 భాగం) | 0-10-0 |
| 11. గృహస్థాశ్రమధర్మము | 2-0-0 | 22. ,, (3 భాగం) | 1-8-0 |
| | | 23. యజ్ఞము | 0-8-0 |

ఇంకను పలుగ్రంథములు గల కేటలాగును చూడుడు.

వలయువారు : శ్రీవ్యాసాశ్రమం, యేర్పేడుపోస్టు, (చిత్తూరుజిల్లా)

అనుచిరునామాకువ్రాయుడు.

## సవరణ

1. వ పేజీలో గూడవల్లి గ్రామకాపరస్తులగు, గూడవల్లి రత్నమ్మగారు—తప్పు

గూడవల్లిగ్రామం మైత్రేయాశ్రమనివాసినియగు రత్నమ్మగారు—ఒప్పు.